ఆంధ్రజ్యోతి



విద్యార్థుల ఉద్యమం

'మాకు ఉచితాలు వద్దు.. భవిష్యత్తు కావాలి..' అంటూ విద్యార్థులు రోడ్డెక్కారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ లేక కళాశాలలు ఆపేసిన సర్టిఫికెట్లను ఇప్పించాలంటూ విజయవాడలోని ధర్నాచౌక్‌లో శనివారం ఏపీయూఎస్ఎఫ్ ఆధ్వర్యంలో విద్యార్థులు ఇలా ధర్నా చేశారు.

ధాన్యం కొనుగోలులో దయనీయ పరిస్థితులు.. ఆర్బీకేల్లో అవస్థలు.. మిల్లుల్లో ఇష్టానుసార వైఖరి.. ఇలా అనేక రకాల సమస్యలతో శనివారం నాటి జెడ్పీ సమావేశం ఆద్యంతం గరంగరంగా సాగింది. జిల్లాలో రైతులు అనుభవిస్తున్న అష్టకష్టాలు, మంజూరు కాని బిల్లులు, పూర్తికాని అభివృద్ధి పనులను జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు నేరుగా అధికారులను ప్రశ్నించారు.

ధాన్యం కొనుగోలుపై గరంగరం



మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక. చిత్రంలో కలెక్టర్లు

జిల్లా పరిషత్ సమావేశంలో జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీల ప్రశ్నల వర్షం

- ధాన్యం కొనుగోలులో రైతుల అవస్థలు ఏకరువు
- అదనపు తరగతి గదుల నిర్మాణానికి నిధులపై నిలదీత
- గృహ నిర్మాణాలకు ఆఖరు బిల్లులు ఇవ్వాలంటూ ఆగ్రహం
- అన్ని సమస్యలు పరిష్కరిస్తామని అధికారుల హామీ
- 2024-25 జెడ్పీ బడ్జెట్ రూ.943.04 కోట్లకు ఆమోదం

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : ధాన్యం కొనుగోళ్లలో జరుగుతున్న అవకతవకలు, అధికారుల నిర్లక్ష్య వైఖరిపై జిల్లా పరిషత్ సమావేశంలో సభ్యులు ధ్వజమెత్తారు. స్థానిక జెడ్పీ కన్వెన్షన్ హాల్లో శనివారం జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. వ్యవసాయ, పౌరసరఫరా శాఖలపై సమీక్ష జరిగిన సమయంలో పలువురు సభ్యులు ధాన్యం విక్రయించేందుకు రైతులు పడుతున్న ఇబ్బందులను కుండబద్దలు కొట్టారు. గూడూరు ఎంపీపీ సంగా మధు మాట్లాడుతూ గూడూరు మండలం తరకటూరు ఆర్బీకే వద్దకు వెంకటేశ్వరరావు అనే రైతు ధాన్యం తీసుకెళ్తే 75 కిలోల బస్తాకు రూ.1,300 ధర వస్తుందని చెప్పారన్నారు. అదే రైతు తన ధాన్యాన్ని మిల్లు వద్దకు తీసుకెళ్తే బస్తాకు రూ.1,450 ధరగా ఇస్తానని మిల్లరు చెప్పారన్నారు. ఆర్బీకేలలో పనిచేసే సిబ్బంది ధాన్యం ధరను తగ్గించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఆర్బీకేల ద్వారా ధాన్యాన్ని 40 నుంచి 50 కిలోమీటర్ల దూరంలోని మిల్లులకు ఆన్‌లైన్‌లో నమోదు చేసి పంపుతున్నారని, మిల్లులకు చేరాక నాణ్యత సక్రమంగా లేదని బస్తాకు రూ.200 చొప్పున ధర తగ్గించి మిల్లర్లు అడుగుతున్నారని పలువురు సభ్యులు సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. జిల్లావ్యాప్తంగా ఇదే పద్ధతి అమలవుతోందని మండిపడ్డారు. దోసపాడుకు చెందిన మిల్లర్ రైతులను కించపరిచేలా మాట్లాడుతున్నారని సభ్యులు సమావేశంలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా కృష్ణా కలెక్టర్ పి.రాజాబాబు, జేసీ గీతాంజలి శర్మ మాట్లాడుతూ ఇకపై ఆర్బీకేలకు 30 కిలోమీటర్లలోపు దూరం ఉన్న మిల్లులకే ధాన్యాన్ని పంపుతామని, ఈ ప్రక్రియకు సంబంధించిన సాఫ్ట్‌వేర్ శుక్రవారం నుంచి అందుబాటులోకి వచ్చిందన్నారు.

అదనపు తరగతి గదుల నిర్మాణానికి నిధులేవీ..?

విద్యాశాఖపై సమీక్ష జరిగిన సమయంలో గూడూరు, కృత్తివెన్ను, కోడూరు తదితర మండలాల జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు మాట్లాడుతూ మండలాల్లో పాఠశాలలకు అదనపు తరగతి గదుల నిర్మాణం కోసం నాబార్డు, సర్వశిక్ష నుంచి నిధులు విడుదలైనా పనులు ప్రారంభించలేదన్నారు. ఈ విషయంపై ఏడెనిమిది నెలలుగా తాము ప్రశ్నిస్తున్నా, నిధులు విడుదల చేస్తామని చెబుతూ కాలయాపన చేస్తున్నారన్నారు.

ధాన్యం ట్యాగింగ్ ఏదీ..?

ఘంటసాల మండలంలో 11 రైస్ మిల్లులు ఉంటే, పదింటికి ధాన్యం పంపేందుకు ఆన్‌లైన్‌లో చూపడం లేదని, దీంతో మచిలీపట్నంలోని మిల్లులకు పంపుతున్నారని, రవాణా కోసం అదనపు ఖర్చులు పెట్టుకోవాల్సి వస్తోందని ఘంటసాల జెడ్పీటీసీ సభ్యుడు తుమ్మల మురళీకృష్ణ తెలిపారు. ఘంటసాల మండలంలోని మిల్లులు సాంకేతిక కారణాలతో ఆన్‌లైన్‌లో కనిపించడం లేదని, ఈ పరిస్థితిని చక్కదిద్దుతామని జేసీ గీతాంజలి శర్మ తెలిపారు. మైలవరానికి చెందిన ఒక రైతుకు చెందిన రెండు లారీల 1318 రకం ధాన్యం కూనపరాజుపర్వ గ్రామంలోని మిల్లుకు ఆన్‌లైన్ ద్వారా పంపారని, 20 రోజులుగా ఈ ధాన్యానికి బిల్లులు చేయకుండా అలాగే ఉంచారని తిరువూరు జెడ్పీటీసీ సభ్యుడు రామచంద్రారెడ్డి మండిపడ్డారు. దీనిపై పౌరసరఫరాల సంస్థ ఎండీతో తాను నేరుగా మాట్లాడుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. ఈ సమస్యను పరిష్కరిస్తామని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు తెలిపారు.

గృహ నిర్మాణ బిల్లులు నిలిపేస్తే ఎలా..?

ఉమ్మడి జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాలు పూర్తయినా బిల్లులు ఇవ్వకుండా జాప్యం చేస్తున్నారని సభ్యులు సమావేశం దృష్టికి తెచ్చారు. సొంతంగా స్థలం ఉండి ఇల్లు కట్టుకుంటామని ముందుకొచ్చిన వారికి అనుమతులు ఇవ్వడం లేదన్నారు. నిర్మాణాలు పూర్తిచేసినా, బిల్లులు ఇవ్వకుండా తొక్కిపెట్టారని కృత్తివెన్ను మండల జెడ్పీటీసీ సభ్యురాలు మైలా రత్నకుమారి ఆగ్రహం వ్యక్తం చేశారు. మోపిదేవి మండలం వెంకటాపురం జగనన్న లే అవుట్‌లో లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకున్నారని, పొలాల మధ్య ఉన్న ఇళ్లకు దారి, కనీస సౌకర్యాలు కల్పించాలని మోపిదేవి జెడ్పీటీసీ సభ్యుడు మెడబలిమి మల్లికార్జునరావు కోరారు. ఉపాధి హామీ పనుల కింద మండలాల్లో చేపట్టిన పనులకు బిల్లులు మంజూరు చేయడంలేదని, సీఎఫ్ఎంఎస్ పేరుతో తీవ్రజాప్యం చేస్తున్నారని సభ్యులు వివరించారు. జిల్లాలో మినుము పంట తడుపునకు, తాగునీటి అవసరాలు తీర్చేందుకు కాల్వలకు నీటిని విడుదల చేయాలని సభ్యులు కోరారు. పులిచింతల ప్రాజెక్టులో నీటి లభ్యత తక్కువగా ఉన్నందున కాల్వలకు తాగునీటి అవసరాల కోసం మాత్రమే విడుదల చేస్తున్నామని నీటిపారుదల శాఖ అధికారులు తెలిపారు.

బడ్జెట్‌కు ఆమోదం

రూ.211.93 కోట్ల నిల్వ బడ్జెట్‌తో జిల్లా పరిషత్ 2024-25 ఏడాది ప్రారంభమైందని జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక తెలిపారు. ఈ ఏడాది బడ్జెట్ ఆదాయం అంచనా రూ.957.36 కోట్లు కాగా, ఖర్చు అంచనా రూ.943.04 కోట్లు ఉందని ఆమె తెలపగా, సభ్యులంతా ఆమోదం తెలిపారు. ఈ సమావేశానికి జిల్లాకు చెందిన ఎంపీలు, శాసనసభ్యులు హాజరుకాలేదు. అవనిగడ్డ శాసనసభ్యుడు సింహాద్రి రమేష్‌బాబు ఒక్కరే హాజరయ్యారు.

అవే తప్పులు


ఓటర్ల తుది జాబితాలో బయటపడుతున్న నిజాలు

డబ్లింగ్స్.. తొలగింపులు.. బోగస్ ఓటర్లు


ఒక్క పెద్దాపురంలోనే భారీగా..

ఓటర్ల తుది జాబితాలు తప్పులతడకలుగా దర్శనమిస్తున్నాయి. డబుల్ ఓట్లు, అక్రమ తొలగింపులు, బోగస్ ఓటర్ల వివాదాలు మళ్లీ చుట్టుముడుతున్నాయి. నందిగామ నియోజకవర్గంలో ఈ తరహా లోపాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. పూర్తిస్థాయిలో ఓటర్ల జాబితాలు చేతికందితే మరిన్ని అక్రమాలు బయటపడే అవకాశాలున్నాయి.

- 4లో..



ఒకే వ్యక్తికి ఉన్న రెండు ఓట్లు



భార్య ఓటు తొలగించమని దరఖాస్తు చేస్తే.. భర్తది కూడా తొలగించారు..

రోడ్డు మూసేసి..

మంత్రి జోగి రమేశ్ నిర్వాకం

- ఉయ్యూరు ప్రధాన సెంటర్‌లో ఆసరా సభ
- రూటు మార్చి వాహనాలను హైవే వైపునకు మళ్లింపు
- ట్రాఫిక్ సమస్యతో జనం అవస్థలు

ఉయ్యూరు, జనవరి 27: పట్టణ పరిధిలోని స్వయం సహాయక సంఘాల సభ్యులకు నాలుగో విడత ఆసరా చెక్కులు పంచేందుకు మంత్రి జోగి రమేశ్ ఆధ్వర్యంలో శనివారం ఉయ్యూరు ప్రధాన సెంటర్‌లో సభ ఏర్పాటు చేశారు. దీనికోసం ప్రధాన రోడ్డు మూసేశారు. ప్రధాన సెంటర్‌లో విజయవాడ రోడ్డు రెండు వైపులా బారికేడ్లతో బ్లాక్‌చేసి సభావేదిక ఏర్పాటుచేశారు. బస్టాండ్ వైపునుంచి విజయవాడ వెళ్లే వాహనాలు, ఆర్టీసీ బస్సులను తాండవలక్ష్మీ థియేటర్, గండిగుంట మీదుగా, చినఓగిరాల వైపు వెళ్లే వాహనాలు కాటూరు రోడ్డు నుంచి హైవే వైపు మళ్లించడంతో ప్రయాణికులు, ప్రజలు ఇబ్బంది పడ్డారు. కాటూరు రోడ్డులో వాహనాల రద్దీ పెరిగి ట్రాఫిక్ నిలిచి ప్రయాణికులు అసౌకర్యానికి గురయ్యారు.



రాజకీయ ఆట..!

ఆడుదాం ఆంధ్రలో వైసీపీ నేతల ఆటలు

- వారు సూచించిన వారికే క్రీడా కిట్లు
- వలంటీర్ల నుంచి డేటా తెప్పించుకుంటేనే ప్రాధాన్యం
- కొందరు పీఈటీల తీరు అధ్వానం
- ఆటల పేరుచెప్పి సొంత పనులు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ/భవానీపురం) : 'ఆడుదాం ఆంధ్ర' పేరుతో ప్రభుత్వం తలపెట్టిన క్రీడా పోటీల నిర్వహణపై అనేక ఆరోపణలు వస్తున్నాయి. ఇప్పటికే ఈ పేరిట ఓట్ల వేట కోసం అధికార పార్టీకి అనుబంధంగా పనిచేసే వారికి కిట్లను పంచారన్న విమర్శలు వచ్చాయి. దీనిని అలుసుగా తీసుకుని కొందరు పీఈటీలు ఆటలను పంచేసుకుంటున్నారు. మైలవరం, తిరువూరు, గన్నవరం మండలాల్లో 'ఆడుదాం ఆంధ్ర' కార్యక్రమం ఇష్టానుసారంగా జరుగుతోంది. ముందే గెలుపోటములను నిర్దేశించుకుని ఇష్టానుసారంగా ఆటలు ఆడుతున్నారు. ఈ గేమ్ మీది, ఆ గేమ్ మాది అన్నట్టుగా వ్యవహరిస్తూ క్రీడా స్ఫూర్తికి విరుద్ధంగా వ్యవహరిస్తున్నారు. ఈ వ్యవహారంలో కొందరు పీఈటీలపై విమర్శలు వస్తున్నాయి. ఇలా ఆటలను పంచుకుంటుంటే క్రీడా స్ఫూర్తి ఏం కలుగుతుందన్న వాదనలు వినిపిస్తున్నాయి.

అధికార పార్టీ నేతల కనుసన్నల్లో..

ఎన్నికల హడావుడిలో అధికారులు పెద్దగా పట్టించుకోకపోవడంతో ఈ ప్రభుత్వ కార్యక్రమం పూర్తిగా అధికార పార్టీ నేతల చేతుల్లోకి వెళ్లింది. వలంటీర్ల ద్వారా సమాచారం తెప్పించుకుని ఆటలను పూర్తిగా రాజకీయం చేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో జరుగుతున్న 'ఆడుదాం ఆంధ్ర' పోటీలకు వచ్చే వారంతా వలంటీర్లు పురమాయించినవారే. ఇలా వచ్చిన వారిలో అధికార పార్టీకి సంబంధించిన వారిని తమ కనుసన్నల్లో పనిచేసే పీఈటీల ద్వారా మంచి జట్లలో వేయిస్తున్నారు. వలంటీర్ల ద్వారా సమాచారం తెలుసుకుని అధికార పార్టీకి ఉపయోగపడే వారిని మండల స్థాయిల్లో మంచి టీముల్లో నియమిస్తున్నారు.

ఆటగాళ్లు కరువు

మండల స్థాయిలో ఇప్పటి వరకు జరిగిన పోటీలను చూస్తే, అసలు షెడ్యూల్ పాటించిన దాఖలాలే లేవు. దీంతో కసితో ఆడాలని వచ్చిన వారిలో నైరాశ్యం నెలకొంటోంది. ఈ పోటీలను వీక్షించటానికి జనాలు కూడా ఎవరూ రాకపోవటంతో క్రీడాకారులు నిరుత్సాహానికి గురవుతున్నారు. ఓటు బ్యాంకును దృష్టిలో ఉంచుకుని ఈ క్రీడా పోటీలకు 15 సంవత్సరాల పైబడిన వారినే తీసుకోవటంతో సమస్యలు మరింత అధికమయ్యాయి. పేరు కోసం భారీ ఎత్తున రిజిస్ట్రేషన్లు చేయించినా, ఆ తర్వాత రాజకీయమయమైపోవటంతో చాలామంది క్రీడాకారులు తప్పుకొన్నారు.



దీంతో జట్ల సంఖ్య పడిపోయింది. షెడ్యూళ్లు కూడా కుదించాల్సిన పరిస్థితి ఏర్పడింది. మధ్యలో సంక్రాంతి సెలవుల కారణంగా చాలామంది ఆటగాళ్లు వెనుదిరిగారు. దీంతో ఆటగాళ్లు లేక, జనం లేక వెలవెలబోతున్న పోటీలు బయటకు తెలియకుండా ఉండటం కోసం ఇలా ఆటలను పంచుకుంటున్నారు. మండల స్థాయిలో జరిగిన ఆటల పోటీలన్నీ దాదాపు పంచేసుకున్నారన్న విమర్శలు వచ్చాయి. గత బుధవారం నుంచి నియోజకవర్గ స్థాయిలో ఆటల పోటీలు జరుగుతున్నాయి. మరోపక్క రాష్ట్ర, జాతీయ స్థాయి ఆటల పోటీలు సమీపిస్తున్నాయి. ఇలాంటి సమయంలో పీఈటీలు క్రీడాకారులకు తగిన శిక్షణ వంటివి ఇవ్వటం వల్ల ఎంతో ప్రయోజనం ఉంటుంది. కొందరు పీఈటీలు తమ సొంత పనులు చేసుకుంటున్నారు. ఒలింపిక్స్ సన్నాహక ఆటలు నిర్వహించాల్సిన తరుణంలో ఆడుదాం ఆంధ్ర పేరుతో పీఈటీలు సొంత పనులు చేసుకోవడం విమర్శలకు తావిస్తోంది.

దశాబ్దం తర్వాత కాముడు చెరువుకు విముక్తి

- లోకాయుక్త ఆదేశాలతో కదిలిన యంత్రాంగం
- ఆక్రమిత చెరువు భూమిలో ప్రభుత్వ బోర్డు ఏర్పాటు
- పదేళ్ల కిందట ఓ బడాబాబు ఆక్రమణ
- చెరువు పూడ్చి యథేచ్ఛగా సాగు
- లోకాయుక్త ఆదేశాలతో ఇప్పటికి కదిలిన అధికారులు



కాముడు చెరువు గతంలో ఇలా..



ఆక్రమణ తర్వాత..



ఇలా ఎండగట్టారు..



ఆక్రమంగా సాగు చేపట్టారు..



లోకాయుక్త ఆదేశాలతో బోర్డు

కాముడి చెర వీడే..

దశాబ్ద కాలానికి పైగా ఆ భూమి ఆక్రమణలో ఉంది. ఆక్రమిత భూమి అని తెలిసి కూడా రెవెన్యూ అధికారులు అటువైపు చూడలేదు. లోకాయుక్త చీవాట్లతో ఇప్పుడు అది ప్రభుత్వ భూమని రెవెన్యూ అధికారులకు గుర్తొచ్చింది. కొంపలంటుకుంటాయేమోనని ప్రభుత్వ భూమిగా బోర్డు పెట్టారు.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : గన్నవరం మండలం వెదురుపావులూరు గ్రామంలోని సర్వే నెంబర్ 765లోని కాముడు చెరువు ఆక్రమణకు సంబంధించి లోకాయుక్త ఆగ్రహంతో రెవెన్యూ అధికారులు దిద్దుబాటు చర్యలు చేపట్టారు. ఓ బడా రాజకీయ నాయకుడు ఈ భూమిని ఆక్రమించుకున్నాడని, సాగు కూడా చేస్తున్నాడని మాజీ సైనికోద్యోగి ఒకరు 2015లో ఫిర్యాదు చేశారు. అప్పటి విచారణ ఇప్పటికి తుది దశకు చేరుకుంది. రెవెన్యూ నిర్వాకంపై లోకాయుక్త సీరియస్‌గా స్పందించటంతో అధికారులు పరుగులు పెట్టి మరీ బోర్డును ఏర్పాటు చేశారు. చెరువులో బడాబాబు కొంతభాగం పూడ్చి చదును చేసి ఆపై సాగు చేపట్టాడు. యుద్ధ ప్రాతిపదికన ఇది ప్రభుత్వ భూమిగా బోర్డయితే పెట్టారు కానీ, స్వాధీనం దిశగా చర్యలు తీసుకోలేదు.

శాస్త్రీయ ఆధారాలతో ఫిర్యాదు

లోకాయుక్తకు సదరు సైనికోద్యోగి చేసిన ఫిర్యాదులో ప్రధానంగా కాముడు చెరువు ఆక్రమణలకు సంబంధించి శాస్త్రీయ ఆధారాలను పొందుపరిచారు. జియోగ్రాఫికల్ శాటిలైట్ చిత్రాల సహా సర్వే నెంబర్ల ఆక్రమణ వివరాలను ఫిర్యాదులో పేర్కొన్నారు. పాత మ్యాప్‌తో పాటు ప్రస్తుత శాటిలైట్ ఇమేజ్‌ను కూడా జోడించి ఆక్రమణ ఎలా జరిగిందో లోకాయుక్త దృష్టికి తీసుకెళ్లారు. రెవెన్యూ అధికారులు, మండల పరిషత్ డెవలప్‌మెంట్ అధికారులు, పంచాయతీ అధికారులకు తెలిసినా ఎలాంటి చర్యలు తీసుకోకపోవటాన్ని కూడా తన ఫిర్యాదులో ప్రస్తావించారు. దాదాపుగా తొమ్మిదేళ్ల విచారణ సాగి ఎట్టకేలకు సీరియస్‌గా లోకాయుక్త ఆదేశాలు జారీ చేసింది. బాధ్యులైన అధికారులపై చర్యలకు సిఫారసు చేసింది.

రెవెన్యూ మెలిక !

- రాష్ట్ర పోలీసు ట్రైనింగ్ సెంటర్‌కు భూములు అప్పగించకుండా సాగదీస్తున్న అధికారులు
- పంచాయతీ అనుమతి కావాలంటూ కొర్రీ
- అధికార పార్టీ నేతల అక్రమ మైనింగ్ కోసమేనా ?

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): రాష్ట్ర పోలీసు ట్రైనింగ్ సెంటర్‌కు కేటాయించిన భూములను అప్పగించేందుకు రెవెన్యూ అధికారులు మెలిక పెడుతున్నారు. రెవెన్యూ చుట్టూ పోలీసు శాఖ కాళ్లరిగేలా తిరిగే పరిస్థితికి తీసుకొచ్చారు. రాష్ట్ర పోలీసు ట్రైనింగ్ సెంటర్‌కు గన్నవరం మండలం వెదురుపావులూరులో కొండ భూమిగా ఉన్న సర్వే నెంబర్ 717(పీ)లో ఐదెకరాలను ఎప్పుడో కేటాయించారు. ఈ భూములను స్వాధీనం చేయాల్సిన రెవెన్యూ అధికారులు చాలాకాలంగా అంతులేని తాత్సారం చేస్తూ వచ్చారు. ఈ భూములను రాష్ట్ర పోలీసు ట్రైనింగ్ సెంటర్‌కు కేటాయించకపోవటంపై అనేక అనుమానాలు నెలకొంటున్నాయి. ఇటీవల గన్నవరం మండలంలో కొండలు, గుట్టలు, చెరువులు ఇలా ఏది పడితే దానిని కొట్టేస్తూ మైనింగ్ మాఫియా పేట్రేగిపోతోందని అందరికీ తెలిసిందే. ఈ పాపంలో రెవెన్యూ అధికారుల పాత్ర కూడా ఉందన్న ఆరోపణలు అనేకమొచ్చాయి. పోలీసు ట్రైనింగ్ అకాడమీ కోసం కేటాయించిన భూములపైనా అధికార పార్టీకి చెందిన కొందరు నేతల కన్నుపడినట్టు తెలుస్తోంది. రానున్న రోజుల్లో ఈ కొండ భూముల్లోనూ అక్రమ మైనింగ్ చేయడం కోసం రెవెన్యూ అధికారులపై తీవ్ర ఒత్తిళ్లు తెచ్చారని తెలుస్తోంది. ఏదో ఒక పేరు చెప్పి పోలీసు శాఖకు ఆ స్థలం బదిలీ కాకుండా రెవెన్యూ అధికారులే అడ్డుపడుతున్నారని తెలుస్తోంది. త్వరితగతిన ఈ భూముల అప్పగించాలని పోలీసు శాఖ నుంచి గన్నవరం రెవెన్యూ అధికారులను తాజాగా విజ్ఞప్తి వచ్చింది. తాజా విజ్ఞప్తిపైనా రెవెన్యూ అధికారులు మెలిక పెట్టారు. ఈ భూములను కేటాయించటానికి స్థానిక పంచాయతీ నుంచి అనుమతి పత్రం కావాలని చెప్పారు. వాస్తవానికి వెదురుపావులూరులోని సర్వే నెంబర్ 717(పీ) లోని ఐదెకరాల భూమి పంచాయతీకి సంబంధించినది కాదు.

వైసీపీ నుంచి టీడీపీలోకి

- వెన్ననపూడి సర్పంచ్ సహా మరో 50 మంది..



వెనిగండ్ల, రావి సమక్షంలో టీడీపీలో చేరిన వెన్ననపూడి సర్పంచ్ బాబీ తదితరులు

నందివాడ, జనవరి 27: వెన్ననపూడి గ్రామానికి మంచినీటి ప్లాంట్, గ్రామాభివృద్ధికి కావాల్సిన సౌకర్యాలను టీడీపీ గుడివాడ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వెనిగండ్ల రాము సమకూర్చడంతో వైసీపీ నుంచి గ్రామ సర్పంచ్ శశి పవన్‌కుమార్(బాబి), నాయకులు కోనేరు వెంకటేశ్వరరావు, దాసరి పండు మరో 50 మంది నాయకులు శనివారం టీడీపీలో చేరారు. గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో వారిని మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, వెనిగండ్ల రాము పార్టీలోకి ఆహ్వానించారు. గుడివాడ అర్బన్ బ్యాంక్ చైర్మన్ పిన్నమనేని పూర్ణ వీరయ్య(బాబ్జీ), దానేటి సన్యాసిరావు, చాట్రగడ్డ రవి, సురేష్, సతీష్, ఉప్పల వెంకటేశ్వరరావు, మహేష్, స్వామి, గంగాధర్, గ్రామస్థులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గాంధీ కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ చైర్మన్‌పై అవిశ్వాసం

- ఫిబ్రవరి 12న మేనేజింగ్ కమిటీ సమావేశం

వన్‌టౌన్, జనవరి 27: విజయవాడ మ్యూజియం రోడ్డులోని గాంధీ కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ చైర్మన్ వేమూరి వెంకటరావుపై బ్యాంక్ మేనేజింగ్ కమిటీలోని ఏడుగురు సభ్యులు అవిశ్వాస తీర్మానం పెట్టడంతో ఫిబ్రవరి 12న బ్యాంక్‌లో సమావేశం నిర్వహించేందుకు సహకార సంఘాల డిప్యూటీ రిజిస్ట్రార్ పి.కిరణ్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. సహకార సంఘాల నియమ నిబంధనల మేరకు చైర్మన్‌పై ఏడుగురు సభ్యులు అవిశ్వాస తీర్మానం పంపారని, దీనిపై సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. సమావేశానికి హాజరుకావాలని చైర్మన్‌తో పాటు మేనేజింగ్ కమిటీలోని 12మంది సభ్యులకు ఆయన నోటీసులు జారీ చేశారు. చైర్మన్ వేమూరి వెంకటరావు, మేనేజింగ్ కమిటీ సభ్యులు అబ్దుల్ ఖయ్యూమ్ అన్సారీ, కొల్లే నాగేశ్వరరావు, కోగంటి వెంకటరామయ్య, జోగరాజు, టీపీఎస్ ఆంజనేయరాజు, తల్లాప్రగడ సుబ్బారావు, భోగాది శివరామకృష్ణప్రసాద్, సజ్జా వెంకట నాగసుబాష్‌తేజ, సగ్గుర్తి నాగేశ్వరరావు, సగ్గుర్తి వెంకటేశ్వరరావు, సుంకర కిషోర్‌బాబుకు నోటీసులు ఇచ్చి, వారి నుంచి అక్నాలెడ్జ్‌మెంట్లు తీసుకోవాలని బ్యాంక్ సీఈవోకు ఆదేశాలిచ్చారు. ఫిబ్రవరి 12న నిర్వహించే సమావేశానికి ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.

కుటుంబరావుకు జీవన సాఫల్య పురస్కారం



ప్రణాళికా సంఘం మాజీ ఉపాధ్యక్షుడు చెరుకూరి కుటుంబరావుకు పురస్కారం అందిస్తున్న ఎన్నారై రంగనాథబాబు, మండలి బుద్ధప్రసాద్

చల్లపల్లి, జనవరి 27: ప్రణాళికా సంఘం మాజీ ఉపాధ్యక్షుడు చెరుకూరి కుటుంబరావుకు గొర్రెపాటి విద్యాట్రస్ట్ ఏటా అందించే జీవన సాఫల్య పురస్కారాన్ని అందించారు. విజయా అకాడమీ వార్షికోత్సవ వేడుకల్లో ముఖ్య అతిథిగా కుటుంబరావు పాల్గొన్నారు. సాధారణ రైతు కుటుంబం నుంచీ వచ్చిన గొర్రెపాటి రంగనాథబాబు అమెరికాలో స్థిరపడినప్పటికీ స్వదేశంలో సేవచేయాలని విద్యాట్రస్ట్ ద్వారా సేవలందించటం స్ఫూర్తిదాయకమని కుటుంబరావు పేర్కొన్నారు. మాజీ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్, విజయా అకాడమీ చైర్మన్ గొర్రెపాటి రంగనాథబాబు, ఎంఈవో పి.వెంకటేశ్వరరావు, సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి పాల్గొన్నారు. పదో తరగతి పరీక్షా ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు గోల్డ్‌మెడల్, నగదు పురస్కారాలు అందించారు.

ఎంఎల్‌హెచ్‌పీ/సీహెచ్‌వో మెరిట్ లిస్టుపై అభ్యంతరాలకు గడువు తేదీ 31

కృష్ణలంక, జనవరి 27: ఎంఎల్‌హెచ్‌పీ/సీహెచ్‌వో పోస్టులను కాంట్రాక్టు పద్ధతిలో భర్తీ చేయడానికి దరఖాస్తులు స్వీకరించి, పరిశీలించి ప్రొవిజనల్ మెరిట్ లిస్టును అన్ని జిల్లా వెబ్‌సైట్‌లలో పొందుపరిచామని, ఆ లిస్టుపై అభ్యంతరాలు ఉంటే జనవరి 29 నుంచి 31వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు తెలపాలని రాజమహేంద్రవరం జోన్-2 ప్రాంతీయ వైద్య ఆరోగ్య సంచాలకులు డాక్టర్ పి.పద్మాశశిధర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యంతరాలను ప్రాంతీయ వైద్య ఆరోగ్య సంచాలకులు, జోన్-2 రాజమహేంద్రవరంలో వ్యక్తిగతంగా లేదా జోన్2.ఎంఎల్‌హెచ్‌పీ2023@జీమెయిల్.కామ్ ద్వారా సమర్పించాలని సూచించారు. జనవరి 31వ తేదీ సాయంత్రం 5 గంటల తర్వాత వచ్చిన అభ్యంతరాలు స్వీకరించబోమని ఆమె పేర్కొన్నారు.

గ్రూప్-1,2 ప్రిలిమ్స్‌కు బీసీ స్టడీ సర్కిల్స్‌లో ఉచిత శిక్షణ

కృష్ణలంక, జనవరి 27: ఏపీపీఎస్సీ గ్రూప్- 1, 2 ప్రిలిమినరీ పరీక్షకు రాష్ట్రంలోని 13 జిల్లాల్లోని బీసీ స్టడీ సర్కిల్స్‌లో డిసెంబరు 27 నుంచి ఉచిత శిక్షణ ప్రారంభించామని ఏపీ బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అనుభవజ్ఞులైన అధ్యాపకులతో శిక్షణ ఇస్తున్నామని, రోజూ ప్రాక్టీస్, గ్రాండ్ టెస్టులు నిర్వహిస్తామని ఆయన తెలిపారు. లైబ్రరీ సౌకర్యం ఉందని స్టడీ మెటీరియల్ అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. స్టైఫండ్, బుక్స్ అలవెన్సు ఇస్తామని తెలిపారు. అర్హులైన బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ అభ్యర్థులు శిక్షణ పొందేందుకు బీసీ స్టడీ సర్కిల్స్ లేదా బీసీ వెల్ఫేర్ అధికారిని ఏపీ బీసీ స్టడీ సర్కిల్, డోరు నెం.74-2-1/5, రోడ్డు నెం.8, అశోక్‌నగర్, పండరీపురం, ఎన్టీఆర్ జిల్లా, విజయవాడ-520007లో లేదా ఫోన్ నెంబర్లు 9505094349, 9966849937లో సంప్రదించాలని సూచించారు.

పోలీసులది పక్షపాత వైఖరి

- టీడీపీ నేత రంగబాబుపై దాడి జరిగి వారమైంది
- ఇప్పటికీ దర్యాప్తు పూర్తి చేయలేదు: కొనకళ్ల నారాయణ
- నిందితులను అరెస్టు చేయాలని యార్లగడ్డ ఆధ్వర్యంలో దీక్ష
- సంఘీభావం తెలిపిన టీడీపీ, జనసేన నాయకులు



గన్నవరంలో నిరసన దీక్ష చేస్తున్న యార్లగడ్డ వెంకట్రావు, మాట్లాడుతున్న కొనకళ్ల నారాయణ

గన్నవరం, జనవరి 27: గన్నవరం పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు, టీడీపీ నేత కాసనేని రంగబాబుపై దాడి జరిగి వారం అవుతున్నా దర్యాప్తు పూర్తి చేయకపోవడం సరికాదని, పోలీసులు పక్షపాతంగా వ్యవహరిస్తున్నారని టీడీపీ కృష్ణా జిల్లా అధ్యక్షుడు కొనకళ్ల నారాయణ ఆరోపించారు. బస్టాండ్ సమీపంలో రంగబాబుపై దాడి చేసిన నిందితులను వెంటనే అరెస్టు చేయాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి యార్లగడ్డ వెంకట్రావు ఆధ్వర్యంలో శనివారం నిరసన దీక్ష నిర్వహించారు. ప్రజల్లో ఉన్ననమ్మకాన్ని పోగొట్టుకోవద్దని పోలీసులకు ఆయన సూచించారు. ఎన్ని దాడులు జరిగినా, కేసులు పెట్టినా, జైలుకు పంపినా అదరకుండా నిలబడటం టీడీపీ నాయకులకు, కార్యకర్తలకు మాత్రమే సాధ్యమన్నారు. "పోలీసుల వైఖరి దుర్మార్గం. జిల్లా ఎస్పీ ఈ కేసు పట్ల బాధ్యతగా వ్యవహరించడం లేదు. పక్కదారి పట్టించే ప్రయత్నాలు చేస్తున్నట్లు కనిపిస్తోంది. కారు నెంబర్‌తో టోల్‌గేట్ సీసీ ఫుటేజ్ ఆధారంగా కారులో ఎవరు ఉన్నారనేది తెలుసుకునే అవకాశమున్నా పోలీసు అధికారులు స్పందించడం లేదు. ప్రశాంతంగా ఉండే గన్నవరం నియోజకవర్గంలో నాలుగేళ్లుగా దాడులు, కేసులు, ఆస్తుల ధ్వంసాలు చేయిస్తూ భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. పోలీసులు శాంతిని కాపాడటంలో విఫలమయ్యారు." అని యార్లగడ్డ వెంకట్రావు ఆగ్రహం వ్యక్తంచేశారు. రాబోయే రోజుల్లో దీనిపై ప్రైవేటు కేసు వేస్తామన్నారు. సెక్షన్లు కూడా సరిగా పెట్టలేదన్నారు. ప్రజలు రోడ్డు ఎక్కక ముందే నిందితులను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. గన్నవరం ఎమ్మెల్యే వంశీ పని అయిపోయిందని, పెట్టే బెడా సర్దుకుని ఇంటికి పోయే సమయం వచ్చిందని గుడివాడ మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు అన్నారు. పోలీసులను అడ్డుపెట్టుకుని ఈ దుర్మార్గుడు చేసిన అన్యాయాలు లెక్కలేవన్నారు. రంగబాబుపై దాడికి సంబంధించి ఆధారాలు ఉన్నా చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని జనసేన నియోజకవర్గ సమన్వయకర్త చలమలశెట్టి రమేష్ ప్రశ్నించారు. ఎస్పీ అసమర్థతా.. ప్రభుత్వ ఆదేశాలను అమలు చేస్తున్నారా? అని ఆయన ప్రశ్నించారు. నిందితులను అరెస్టు చేయకపోగా ఎస్పీ దాడులను సమర్థించడం దారుణమన్నారు. టీడీపీ, జనసేన నాయకులు జాస్తి వెంకటేశ్వరరావు, గొడ్డళ్ల చిన్న రామారావు, ఆరుమళ్ల కృష్ణారెడ్డి, దయాల రాజేశ్వరరావు, చిరుమావిళ్ల సూర్యం, దొంతు చిన్న, ఆళ్ల గోపాలకృష్ణ, మూల్పూరి సాయి కల్యాణి, మండవ లక్ష్మి, మేడేపల్లి రమాదేవి, గూడవల్లి నర్సయ్య, గుండపనేని ఉమా వర ప్రసాద్, వేములపల్లి శ్రీనివాసరావు, పడమట రంగారావు, చిమటా రవివర్మ, మండవ రమ్యకృష్ణ, బోడపాటి రవి, జి.తులసీమోహన్ పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో ఇద్దరు నిందితులు ?

గన్నవరం: గన్నవరం పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు కాసనేని రంగబాబుపై జరిగిన దాడిలో పాల్గొన్న ఇద్దరు నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. గత ఆదివారం పొలం కావాలి చూపించమంటూ వచ్చి గుర్తు తెలియని ఆరుగురు కలిసి రంగబాబుపై దాడి చేసి తీవ్రంగా గాయపర్చిన సంఘటన తెలిసిందే. గన్నవరం పోలీసులు రెండు బృందాలుగా ఏర్పడి వారు ఉపయోగించిన కారు, ఫోన్ నెంబర్ల ఆధారంగా దర్యాప్తు చేపట్టారు. ఐతే దాడి చేసినవారంతా హైదరాబాద్ పాతబస్తీకి చెందిన వారిగా పోలీసులు గుర్తించారు. తొలుత ఒక బృందం నెల్లూరు వైపు వెళ్లివచ్చింది. హైదరాబాద్ పాతబస్తీ కేంద్రంగా దర్యాప్తు చేయడంతో ఇద్దరు మాత్రమే దొరికారు. వీరిని ఎంత విచారించినా ఎవరో చెప్పారు. దాడి చేశామని మాత్రమే చెప్పినట్లు తెలిసింది. వాడిన కారు విజయవాడలో అద్దెకు తీసుకుని అప్పగించి మళ్లీ వెళ్లిపోయామని పోలీసులకు చెప్పినట్టు తెలిసింది. ఇంకా నలుగురు నిందితులు దొరకాల్సి ఉంది. వారి కోసం ఒక బృందం ముమ్మరంగా గాలిస్తున్నట్లు తెలిసింది. నిందితులను అదుపులోకి తీసుకున్న విషయం పోలీసులు గోప్యంగా ఉంచడం, ఈ కేసుకు సంబంధించి ఎలాంటి విషయాలు బయటకు చెప్పకపోవడం గమనార్హం.

టీడీపీ అధికారంలోకి రావాలని.. కొల్లు రవీంద్ర దంపతుల చండీయాగం



యాగం చేస్తున్న కొల్లు రవీంద్ర దంపతులు

మచిలీపట్నం టౌన్, జనవరి 27: రాష్ట్ర ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని, టీడీపీ మళ్లీ అధికారంలోకి రావాలని ఆ పార్టీ పొలిట్ బ్యూరో సభ్యుడు కొల్లు రవీంద్ర, నీలిమ దంపతులు శనివారం చండీ, సుదర్శనయాగాలను పార్టీ మచిలీపట్నం అసెంబ్లీ నియోజకవర్గ కార్యాలయంలో ప్రారంభించారు. రెండు రోజుల పాటు యాగాలను జరపనున్నారు. చండీశ్వర, నారసింహ, దుర్గ, విష్ణు, లక్ష్మి, లలితాదేవిల విగ్రహాలను ఏర్పాటు చేసి భారీ అర్చనలు జరిపారు. 108 ఔషధ ద్రవ్యాలతో యాగం ప్రారంభించారు. మహాచండీయాగంలో పెద్ద సంఖ్యలో మచిలీపట్నం, చుట్టుపక్కల నియోజకవర్గాల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. టీడీపీ రాష్ట్ర నాయకుడు కొనకళ్ళ బుల్లయ్య, తెలుగురైతు కృష్ణాజిల్లా అధ్యక్షుడు గోపు సత్యనారాయణ, టీడీపీ నాయకులు గొర్రెపాటి గోపీచంద్, తలారి సోమశేఖర్, లంకే శేషగిరి, లంకే హరికృష్ణ, ఎండీ ఇలియాస్ పాషా, పిప్పళ్ల కాంతారావు, పి.వి. ఫణికుమార్, కుంచే నాని, లంకిశెట్టి నీరజ, చిన్నం శివ, మోటమర్రి బాబా ప్రసాద్, చిత్తజల్లు నాగరాము, దింటకుర్తి సుధాకర్, డాక్టర్ బి.ధన్వంతరీ ఆచార్య పాల్గొన్నారు.



పెనుమత్సలో బోరు గుంతలో పడిన కొడాలి సింధూషాను రక్షించేందుకు పక్కన సమాంతరంగా గుంత తవ్వుతున్న స్థానికులు



గుంతలో నుంచి బయటకు తీశాక..

బోరుగుంతలో పడిన బాలిక

- సమాంతరంగా గుంతతవ్వి రక్షించిన స్థానికులు

పమిడిముక్కల, జనవరి 27: డ్రెయినేజీ నిర్మాణానికి తీసిన బోరు గుంతలో పడిన పదేళ్ల దివ్యాంగ బాలికను సమాంతరంగా మరో గుంత తవ్వి రక్షించిన సంఘటన శనివారం పెనుమత్సలో జరిగింది. వివరాలలోకి వెళితే డ్రెయినేజీలో పిల్లర్లు వేసేందుకు ఓ ఇంటి వద్ద తవ్విన పది అడుగుల బోరు వద్దకు వెళ్లిన కొడాలి సింధూష ప్రమాదవశాత్తు కాలు జారి గుంతలో పడిపోయింది. గమనించిన స్థానికులు కేకలు వేశారు. దీంతో అక్కడకు చేరుకున్న ఇరుగుపొరుగువారు బాలికను బయటకు తీసేందుకు తువ్వాళ్లు ముడులు వేసి గుంతలోకి జారవిడిచారు. దివ్యాంగురాలైన బాలిక వాటిని పట్టుకోలేక పోయింది. గుంతకు సమాంతరంగా జేసీబీతో గుంతతవ్వి ఆమె చేతులకు తువ్వాళ్లు ముడివేసి బయటకు లాగారు. బాలికను అంబులెన్స్‌లో మచిలీపట్నం వైద్యశాలకు తరలించగా ఆమె ఆరోగ్యంగా ఉన్నట్టు సమాచారం. పమిడిముక్కల ఏఎస్ఐ ఆనందరావు, సిబ్బంది సహాయ చర్యల్లో పాల్గొన్నారు.

పోరంకిలో అర్ధరాత్రి ఘోరం

- సైడ్ డ్రెయిన్‌లో ఇరుక్కుని ఇంటిపై పడిన కంకరు లారీ
- గోడ కూలి ఇంటి యజమాని అక్కడికక్కడే మృతి



ఇంటిపై పడ్డ లారీని క్రేన్ సాయంతో తీస్తున్న స్థానికులు

పెనమలూరు, జనవరి 27: పేద బతుకులు.. యజమాని ఇంటి పోషణకు గుడిలో వాచ్‌మన్‌గా పని చేస్తాడు. భార్య దగ్గర్లోని ఓ పచ్చళ్ల కంపెనీలో కూలికి వెళుతుంది. ఒక్కగానొక్క కొడుకు బ్యాంకులో అటెండరుగా పని చేస్తున్నాడు. కంకరు లారీ రూపంలో వచ్చిన మృత్యువు ఆ ఇంటి యజమానిని బలి తీసుకుంది. దీంతో ఆ కుటుంబం శోక సముద్రంలో మునిగింది. ఈఘటన శుక్రవారం అర్ధరాత్రి పోరంకి యాదవుల బజారులో జరిగింది. పోరంకికి చెందిన మేడి శంకర్ సీతాపురం కాలనీలో ఒక గుడిలో వాచ్‌మన్‌గా పని చేస్తున్నాడు. శుక్రవారం అర్ధరాత్రి ఆరోడ్డులోకి కంకరు హెవీ లోడ్‌తో ఉన్న పదిటైర్ల లారీని ప్రవేశించే అవకాశం లేకపోయినా డ్రైవర్ రివర్స్ చేస్తూ వెళ్లాడు. దీంతో లారీ సైడుకాల్వలోకి ఒరిగింది. దీంతో లారీ బాడీభాగం పక్కనే ఉన్న శంకర్ ఇంటి గోడపై పడింది. దీంతో గోడ కూలి ఇంట్లో నిద్రిస్తున్న శంకర్‌పై పడడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

క్రాంతి పథం సిబ్బంది నిరవధిక సమ్మె



కళ్లకు గంతలు కట్టుకుని ధర్నాచౌక్ వద్ద నిరసన తెలుపుతున్న క్రాంతిపథం సిబ్బంది

మచిలీపట్నం టౌన్, జనవరి 27: పే స్కేళ్లు ఇవ్వాలని, పదోన్నతులు కల్పించాలని, ప్రభుత్వ సంస్థగా సెర్ప్‌ను పరిగణించాలని ధర్నాచౌక్ వద్ద శనివారం నుంచి డీఆర్డీఏ క్రాంతి పథం సిబ్బంది నిరవధిక సమ్మెలోకి దిగారు. కృష్ణాజిల్లా సంఘ నాయకుడు సీహెచ్ త్రిపురయ్య, ప్రధాన కార్యదర్శి సీహెచ్‌వీవీ బాపనయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన సమ్మెకు సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర నాయకులు పెదయాదర సర్పంచ్ గల్లా తిమోతి, చిన్నాపురం సర్పంచ్ కాగిత గోపాలరావు మద్దతు తెలిపారు. క్రాంతి పథం సిబ్బందికి వెంటనే కారుణ్య నియామకాలు చేపట్టాలని, సర్వీసులను ఉద్యోగులకు పెంచినట్టు 62 ఏళ్లకు పెంచాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బేసిక్‌పేపై నూరు శాతం ఈపీఎఫ్‌ను వెంటనే చెల్లించాలని త్రిపురయ్య డిమాండ్ చేశారు. సెక్రటరీ ఎస్.కిషోర్, దాసు, మల్లేశ్వరి పాల్గొన్నారు.

ఆస్తి కోసం తండ్రిని హతమార్చిన కొడుకు

పెనుగంచిప్రోలు, జనవరి 27: వెంగనాయకునిపాలెంలో ఆస్తి కోసం కన్నతండ్రిని ఓ కుమారుడు కడతేర్చాడు. ఈఘటన శుక్రవారం రాత్రి జరిగింది. జగ్గయ్యపేట సీఐ ఎం.జానకిరామయ్య కథనం మేరకు ముండ్లగిరి చిన్న వెంకటేశ్వర్లు(50) గ్రామంలో ప్రైవేట్ ఎలక్ట్రీషియన్‌గా పని చేస్తున్నాడు. భార్య పదిహేనేళ్ల క్రితమే మరణించింది. పెద్ద కొడుకు నరేంద్ర, చిన్న కొడుకు నవీన్‌లకు వివాహాలు కాలేదు. తండ్రి, చిన్నకుమారుడు నవీన్ ఒకే ఇంట్లో ఉంటున్నారు. పెద్ద కొడుకు నరేంద్ర విడిగా ఉంటున్నాడు. చిన్న వెంకటేశ్వర్లుకు అరెకరం పొలం, సొంత ఇల్లు ఉంది. ఇల్లు, పొలం అమ్మి తనకు వచ్చే వాటా ఇవ్వాలని పెద్ద కొడుకు నరేంద్ర తండ్రితో కొంత కాలంగా గొడవలు పడుతున్నాడు. శుక్రవారం రాత్రి చిన్న కుమారుడు లేని సమయంలో తండ్రిపై నరేంద్ర రాయితో దాడి చేసి హత్య చేశాడు. చిన్న కుమారుడు నవీన్ శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సీహెచ్ కనకదుర్గా ప్రసాద్ తెలిపారు.

ఇంజనీరింగ్ విద్యార్థిని ఆత్మహత్య

మైలవరం, జనవరి 27: ఖర్చుల నిమిత్తం తన కజిన్ బ్రదర్ డబ్బులు ఇవ్వలేదని మనస్థాపం చెంది పట్టణంలోని ఓ కళాశాలలో ఇంజనీరింగ్ ద్వితీయ ఏడాది చదువుతున్న బొర్రా రోషిణి(20) కళాశాల హాస్టల్ భవనంలో శనివారం తెల్లవారుజామున ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసుల కథనం ప్రకారం చందర్లపాడు మండలం ముప్పాళ్ల గ్రామానికి చెందిన బొర్రా నరసింహారావు కుమార్తె రోషిణి మైలవరంలో ఓ ప్రైవేట్ కళాశాలలో హాస్టల్లో ఉంటూ చదువుకుంటోంది. ఖర్చులకు డబ్బులు అవసరం వచ్చి కజిన్ బ్రదర్‌ను అడిగింది. అతను లేవని చెప్పడంతో మనస్థాపం చెంది ఆత్మహత్య పాల్పడింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏసీపీ ఎం.రమేష్ తెలిపారు.

30న సర్పంచ్‌ల నిరాహార దీక్ష

ఉయ్యూరు, జనవరి 27: మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా ఈనెల 30న మచిలీపట్నంలో సర్పంచ్‌ల రిలే నిరాహారదీక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు ఉమ్మడి కృష్ణాజిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు గోలి వసంతకుమార్ తెలిపారు. డిమాండ్లను ఆమోదించాలని పంచాయతీరాజ్ చాంబర్, సర్పంచ్‌ల సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన ఆందోళన, ఉద్యమ కార్యాచరణలో భాగంగా దీక్ష చేస్తున్నామని ఆయన తెలిపారు. శనివారం ఆకునూరులో విలేకరులతో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం గ్రామ పంచాయతీలకు విడుదల చేసిన నిధులు రాష్ట్ర ప్రభుత్వం దారి మళ్లించిందని, పంచాయతీల ఖాతాల్లో రూపాయి కూడా లేకుండా చేసిందని ఆయన ఆగ్రహం వ్యక్తంచేశారు. దీంతో గ్రామాల్లో అభివృద్ధి పనులు చేయలేకపోతున్నామని తెలిపారు. కనీసం మౌలిక వసతులు కల్పించలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు.

31న విభిన్న ప్రతిభావంతుల జాబ్‌మేళా

కృష్ణలంక, జనవరి 27: ఉపాధి కల్పన శాఖ, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ, యూత్ ఫర్ జాబ్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విజయవాడ ఐటీఐ కళాశాల ప్రాంగణంలోని ఉపాధి కల్పన అధికారి కార్యాలయంలో విభిన్న ప్రతిభావంతులకు ఈనెల 31వ తేదీన జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి దేవరపల్లి విక్టర్‌బాబు, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎస్.శ్రీనివాసరావు శనివారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మేళా ప్రారంభమవుతుందని, 18 నుంచి 35 ఏళ్లలోపు వారు 10వ తరగతి ఆపై చదివిన విభిన్న ప్రతిభావంతులు పాల్గొనవచ్చని వారు పేర్కొన్నారు. ఉద్యోగాలకు ఎంపికైన వారికి ఏడాదికి రూ.1.2 లక్షల నుంచి రూ.3 లక్షల వరకు వేతనం లభిస్తుందని తెలిపారు. జాబ్‌మేళాకు హాజరయ్యే అభ్యర్థులు విద్యార్హత ధ్రువపత్రాలు, ఆధార్‌కార్డు జిరాక్సు కాపీలతో నేరుగా ఇంటర్వ్యూలకు హాజరుకావాలని సూచించారు. హెచ్‌టీటీపీఎస్://డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఎన్‌సీఎస్.జీవోవీ.ఇన్ లింక్ ద్వారా వివరాలను నమోదు చేసుకోవాలని, మరిన్ని వివరాలకు 82424 16211 నెంబరులో సంప్రదించాలని వారు సూచించారు.

అవే తప్పులు

- ఓటర్ల తుది జాబితాలో బయటపడుతున్న తప్పులు
- డబ్లింగ్స్.. తొలగింపులు.. బోగస్ ఓటర్లు
- ఒక్క పెద్దాపురంలోనే భారీగా..

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): బోగస్ ఓట్ల వ్యవహారంతో నందిగామ నియోజకవర్గంలోని వీరులపాడు మండలం పెద్దాపురం గ్రామం ఇప్పటికే వార్తల్లో నిలిచింది. అక్రమంగా ఇంటర్ స్టేట్ బోగస్ ఓట్లు పుట్టుకొచ్చాయన్న ఉద్దేశంతో ఈ గ్రామంలో అలజడి రేగిన సంగతి తెలిసిందే. తుది జాబితా తర్వాత కూడా మళ్లీ అలాంటి తప్పులే కనిపిస్తుండటంతో ఆందోళన వెల్లువెత్తుతోంది. పెద్దాపురం గ్రామంలో ఈసారి డబ్లింగ్ ఓట్లు కలకలం సృష్టిస్తున్నాయి. దీనికి సంబంధించి 'ఆంధ్రజ్యోతి'కి ఆధారాలు చిక్కాయి.

డబ్లింగ్ ఓట్లు ఇవీ..

కీలం వీరభద్రరావుకు రెండు ఓట్లు ఉన్నట్టు వెలుగులోకి వచ్చింది. మొదటి ఓటు 800 సీరియల్ నెంబర్‌లో జేఎస్‌జీ2823284 నెంబర్‌తో ఉండగా, రెండోది 151 సీరియల్ నెంబర్‌లో టీఏఈ063393 ఉంది. ఇదే గ్రామంలో 1102 సీరియల్ నెంబర్‌లో దీపర్ కొరకొప్పుల (ఓటరు కార్డు నెంబర్ టీఏఈ1780212) ఉండగా, సీరియల్ నెంబర్ 589లోనూ ఓటరు కార్డు నెంబర్ టీఏఈ1776889తో ఉంది. కమల్ సాహెబ్ షేక్ ఓటరుకు సీరియల్ నెంబర్ 738లో టీఏఈ1788496 నెంబర్ ఉండగా, సీరియల్ నెంబర్ 724లో ఎస్‌వోఎక్స్1079459 ఓటరుకార్డు నెంబర్‌తో ఓటు ఉంది. ఇలా చెప్పుకొంటూ పోతే మరో డజను వరకు డబ్లింగ్ ఓట్లు ఉన్నాయి.

గతంలో ఓట్ల తొలగింపులు ఇవీ..

గతంలో గడ్డం వీరాస్వామికి ఏపీ130760363295 నెంబర్, రంగిశెట్టి శ్రీలక్ష్మికి టీఏఈ0686311 నెంబరుతో ఓటు ఉండేది. 2019, 2020, 2021 ఓటర్ల జాబితాల్లో వీరి పేర్లు ఉన్నాయి. కానీ, తుది జాబితాలో వీరి పేర్లు లేవు. ఇంకో విచిత్రం ఏమిటంటే, భార్య మీరాబీ షేక్ ఓటు తొలగింపునకు ఫాం-7 దరఖాస్తు చేస్తే, ఆమెతో పాటు ఆమె భర్త షేక్ మస్తాన్ వలీ ఓటును కూడా తొలగించడం గమనార్హం.

తెలంగాణా ఓట్లు ఇంకా తొలగించలేదు

ఓటర్ల తుది జాబితాలో కూడా ఇంకా తెలంగాణా ఓట్లు ఉండటం ఆందోళన కలిగిస్తోంది. పెద్దాపురం గ్రామంలో రహీమున్నీసా దూదేకుల (తెలంగాణా ఓటరు కార్డు నెంబరు ఆర్‌క్యూఎన్0541615)కు ఖమ్మం జిల్లా మధిరలో ఓటుహక్కు ఉంది. అక్కడే రేషన్ కార్డు కూడా ఉంది. ఇదే రహీమున్నీసాకు మన రాష్ట్రంలో నందిగామ నియోజకవర్గంలోని పెద్దాపురం గ్రామంలో (ఏపీ ఓటరు కార్డు నెంబర్ టీఏఈ1610609) ఓటుహక్కు ఉంది. అలాగే, దూదేకుల జానీ, దూదేకుల షాహిబ్జానీ ఓట్లు కూడా రెండు రాష్ట్రాల్లో ఉన్నాయి. ఫాం-7 ఇచ్చినప్పటికీ స్థానిక ఎన్నికల అధికారులు వీటిని తొలగించలేదు. ఇవి ప్రాథమికంగా మాత్రమే వెలుగుచూశాయి. ఇంకా ఓటర్ల జాబితాల పంపిణీ పూర్తికాలేదు. రాజకీయ పార్టీల బీఎల్ఏల చేతికి పూర్తిగా వచ్చాక అనేక అంశాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

ఆఫ్‌లైన్‌లో తోలిన ధాన్యాన్ని ఆన్‌లైన్ చేయించండి



కాటూరులో మంత్రి జోగి రమేశ్‌కు గోడు వెళ్లబోసుకుంటున్న రైతులు

ఉయ్యూరు, జనవరి 27: "ధాన్యం అమ్ముకునేందుకు అవస్థలు పడుతున్నాం. ఆఫ్‌లైన్‌లో తోలిన ధాన్యం ఆన్‌లైన్ చేయడంలేదు. మిగిలిన ధాన్యం అమ్ముకునేందుకు ఆర్బీకేల చుట్టూ చెప్పులరిగేలా తిరుగుతున్నాం. అయినా పట్టించుకున్న వారులేరు. ఆఫ్ లైన్‌లో తోలిన ధాన్యాన్ని ఆన్‌లైన్ చేయించి ఆదుకోండి" అంటూ మంత్రి జోగి రమేశ్‌కు కాటూరు, చుట్టుపక్కల గ్రామాల రైతులు మొరపెట్టుకున్నారు. కాటూరు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో శనివారం ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమానికి వచ్చిన మంత్రిని వారు కలిశారు. తోలిన ధాన్యానికి మిల్లుల మార్పిడి చేయాలని కోరారు. సివిల్ సప్లైస్ ఇన్‌చార్జ్ డీఎం, ఉయ్యూరు ఆర్డీవో డి.రాజు, సివిల్ సప్లైస్ అధికారి సుజనను మంత్రి అక్కడకు పిలిపించి సమస్యలు పరిష్కరించాలని వారిని ఆదేశించారు.

ప్రత్యేక ప్రమాణాలున్న పుస్తకాలే చదవండి

- గ్రూప్-2 అభ్యర్థులకు ఎమ్మెల్సీ లక్ష్మణరావు సూచన

గవర్నర్‌పేట, జనవరి 27: గ్రూప్-2 పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులు ప్రత్యేకమైన ప్రమాణాలు కలిగిన పుస్తకాలు, తెలుగు అకాడమీ నూతనంగా అచ్చువేయించిన గ్రూప్-2 పుస్తకాలను చదివితే విజయం సాధించవచ్చని ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు సూచించారు. ఎంజీ రోడ్డులోని ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో ఉమ్మడి కృష్ణాజిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ టి.జమలపూర్ణమ్మ అధ్యక్షతన గ్రూప్-2 పరీక్షలపై శనివారం నిర్వహించిన అవగాహనా సదస్సులో ఆయన మాట్లాడారు. ఆయన రచించిన ఆంధ్రుల చరిత్ర, ఆంధ్రప్రదేశ్ ఆర్థిక వ్యవస్థ, భారత సమాజం స్టడీ మెటీరియల్‌ను జమలపూర్ణమ్మ ఆవిష్కరించారు. గ్రంథాలయాధికారిణి కె.రమాదేవి పాల్గొన్నారు.

చమురు నిక్షేపాల్లో 50 శాతం రాష్ట్రానికివ్వాలి

- జై ఆంధ్ర డెమొక్రటిక్ ఫోరం అధ్యక్షుడు డాక్టర్ తరుణ్ కాకాని

ధర్నాచౌక్, జనవరి 27: రాష్ట్రంలోని కృష్ణా, గోదావరి బేసిన్‌లోని సహజ వాయువు, చమురు నిక్షేపాల్లో రాష్ట్రానికి 50 శాతం కేటాయించాలని జై ఆంధ్ర డెమొక్రటిక్ ఫోరం అధ్యక్షుడు డాక్టర్ తరుణ్ కాకాని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గాంధీనగర్ ప్రెస్‌క్లబ్‌లో ఫోరం ఆధ్వర్యంలో శనివారం సమావేశం నిర్వహించారు. 12వ ఆర్థిక సంఘం సిఫార్సులను అమలు చేయాలని, రాష్ట్రంలోని అన్ని ప్రధాన పార్టీలు తమ ఎన్నికల ఎజెండాలో ఆయా అంశాలను చేర్చాలని తరుణ్ డిమాండ్ చేశారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి తీరని ద్రోహం చేసిందని ధ్వజమెత్తారు. రాబోయే ఎన్నికల్లో బీజేపీ ప్రభుత్వాన్ని కేంద్రంలో అధికారంలోకి రాకుండా ఓడించాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో పారిశ్రామికవేత్తల దోపిడీని అరికట్టాలని, పారిశ్రామికాభివృద్ధి చేసి యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని పలువురు వక్తలు డిమాండ్‌చేశారు. కాకాని ఆశయ సమితి సభ్యులు గుమ్మడి రామకృష్ణ, కోనేరు బసవేశ్వరరావు, వేములపల్లి వెంకట రమణ, ఫోరం నేతలు మేడా శ్రీనివాస్, బేతు రామ్మోహన్‌రావు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	119, 127, 138
చికెన్ విత్ స్కిన్	226
చికెన్ స్కిన్‌లెస్	236

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 5.40

టీడీపీ నేత రంగబాబుకు పరామర్శ

గన్నవరం, జనవరి 27: వైసీపీ కిరాయి గూండాల దాడిలో తీవ్ర గాయాలపాలైన టీడీపీ నేత, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు కాసన్నేని రంగాబాబు చినఅవుటపల్లి పిన్నమనేని ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా శనివారం సాగునీటి సంఘం వినియోగదారుల సంఘాల సమైక్య రాష్ట్ర అధ్యక్షుడు ఆళ్ల గోపాలకృష్ణ పరామర్శించారు. యోగక్షేమాలు తెలుసుకుని డాక్టర్లతో మాట్లాడి మెరుగైనవైద్యం అందించాలని కోరారు.



రంగబాబును పరామర్శిస్తున్న ఆళ్ల గోపాలకృష్ణ

టీడీపీ విజయమే లక్ష్యం

మాజీ ఎమ్మెల్యే బోడె ప్రసాద్

పెనమలూరు, జనవరి 27 : టీడీపీ విజయమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ సమన్వయంతో పని చేయాలని, గత ఎన్నికల్లో దూరం జరిగిన పార్టీ శ్రేణులను గుర్తించి తిరిగి వారిని పార్టీలో చేర్చుకోవడం, వైసీపీ పాలనలో ఎంత నష్టం జరిగిందన్న విషయాన్ని తెలియజెప్పడం, ఓటరు జాబితాల పట్ల అప్రమత్తంగా ఉంచడం, కొత్త ఓటర్లను ఆకర్షించడం, పార్టీ మేనిఫెస్టోపై విస్తృతంగా ప్రచారం చేయడం తదితర అంశాల్లో పార్టీ శ్రేణులు అప్రమత్తంగా ఉండి తిరిగి పార్టీని అధికారంలోకి వచ్చేలా చూడాలని మాజీ ఎమ్మెల్యే బోడె ప్రసాద్ పిలుపునిచ్చారు. శనివారం పోరంకి టీడీపీ కార్యాలయంలో ఆరవ క్లస్టరు పరిధి శ్రేణులకు జరిగిన ఇంటెగ్రేటెడ్ శిక్షణ కార్యక్రమానికి హాజరయిన మండల టీడీపీ శ్రేణులనుద్దేశించి మాట్లాడారు. పార్టీ బలోపేతానికి తీసుకోవాల్సిన వివిధ నిర్ణయాల గురించి శిక్షణ సభ్యులు చిత్తూరు వెంకటేశ్వర్లు, అనుపమ, సూర్యప్రకాష్‌లు వివరించారు. కార్యక్రమంలో క్లస్టరు ఇన్‌చార్జి మారుపూడి ధనకోటేశ్వరరావు, యూనిట్ సభ్యులు కోయ ఆనంద్‌ప్రసాద్, కోనేరు వెంకటేశ్వరరావు, దొండపాటి సురేష్, బూత్ కన్వీనర్లు, గ్రామ పార్టీ అధ్యక్షులు బాబుసుబాని, బొమ్మిడి అన్నపూర్ణ, చిగురుపాటి శ్రీనివాస్, పులి విజయ్, పీతా గోపీచంద్, అనుమోలు ప్రభాకరరావు, పిడికిటి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



విజయ సంకేతాన్ని చూపుతున్న పెనమలూరు ఆరవ క్లస్టరు టీడీపీ శ్రేణులు

కానూరు టీడీపీ కార్యాలయంలో..

కానూరు టీడీపీ కార్యాలయంలో జరిగిన టీడీపీ ఇంటెగ్రేటెడ్ శిక్షణా కార్యక్రమంలో పార్టీ పరిశీలకులు జువ్వా రాంబాబు, టీడీపీ కృష్ణాజిల్లా ఉపాధ్యక్షుడు వెలగపూడి శంకరబాబులు పాల్గొన్నారు. టీడీపీ ఇంటెగ్రేటెడ్ శిక్షణా కార్యక్రమంలో కాసగాని శ్రీనివాస్ టీడీపీ శ్రేణులకు పలు అంశాలపై సమగ్ర శిక్షణ ఇచ్చారు.



విజేతను అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం

వీఆర్ సిద్ధార్థ విద్యార్థికి గోల్డ్‌మెడల్

పెనమలూరు, జనవరి 27 : వీఆర్ సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాలలో మొదటి సంవత్సరం ఎంసీఏ చదువుతున్న ఉప్పల సాయి సుబ్రహ్మణ్యం గోల్డ్‌మెడల్ సాధించినట్లు కళాశాల పీడీ పోతిన రఘు తెలిపారు. ఈనెల 13న హైదరాబాద్‌లో జరిగిన 20వ సీనియర్ నేషనల్ సాఫ్ట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో ఈ ఘనతను సాధించాడు. విజేతను కళాశాల కన్వీనర్ మలినేని రాజయ్య, ప్రిన్సిపాల్ రత్నప్రసాద్, డీన్ పాండురంగారావు, ఎంసీఏ విభాగ అధిపతి జ్యోతి అభినందించారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం



సాయం అందజేస్తున్న సిద్ధార్థ అకాడమీ పెద్దలు

పెనమలూరు, జనవరి 27 : సిద్ధార్థ అకాడమీ ఆఫ్ జనరల్ అండ్ టెక్నికల్ ఎడ్యుకేషన్, పీవీపీ సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాలలు తమ సంస్థలో పని చేస్తూ గుండెపోటుతో మృతి చెందిన ఉద్యోగి మోహన్‌రావు కుటుంబానికి తమ సహాయ హస్తాన్ని అందించాయి. అకాడమీ కార్యదర్శి లక్ష్మణరావు, సంయుక్త కార్యదర్శి ఎన్ లలితప్రసాద్‌లు మోహన్‌రావు కుటుంబానికి అకాడమీ తరపున రూ. 3.2 లక్షలను విరాళంగా అందించగా, సిబ్బంది, విద్యార్థులు 3.23 లక్షలను అందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ శివాజీబాబు, ఎన్ఎస్ఎస్ అధికారి డాక్టర్ శ్యాంలు పాల్గొన్నారు.

అగ్ని బాధిత కుటుంబానికి..

కాటూరు(ఉయ్యూరు) : కాటూరులో అగ్ని బాధిత కుటుంబానికి టీడీపీ పెనమలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి బోడె ప్రసాద్ రూ. 5వేల ఆర్థికసాయం అందజేశారు. గ్రామానికి చెందిన వేపూరి బుజ్జి పూరిల్లు ప్రమాదవశాత్తు కాలిపోగా టీడీపీ నాయకులతో కలసి పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. ఎంపీటీసీ సజ్జా అనూష, పార్టీ నాయకులు వెంకటనారాయణ, కాటూరి శరత్ బాబు, యుగబాబు, కె నాగభూషణం, ఎస్ మధు, వి శ్రీనివాసరావు, జి చంద్రశేఖర్ తదితరులు అగ్నిబాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

ఐడియేషన్‌పై అవగాహన

పెనమలూరు, జనవరి 27: గంగూరు ధనేకుల ఇంజనీరింగ్ కళాశాలలో ఈసీఈ బ్రాంచి ద్వితీయ, తృతీయ సంవత్సరం విద్యార్థులకు శని వారం ఒకరోజు ఐడియేషన్, ఇన్నోవేషన్‌పై అవగాహన క్యాంపు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఏపీఐఆర్ 2 సీఈఓ గోపీకృష్ణ విద్యార్థులకు నెట్‌వర్కింగ్ అవకాశాలు, టెక్నాలజీ ఇంటెగ్రేషన్ తదితరల అంశాలపై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో విద్యార్థులతో పాటు చైర్మన్ రవీంద్రనాథ్ ఠాగూర్, కార్యదర్శి భవానీ ప్రసాద్, ప్రిన్సిపాల్ డాక్టర్ రవి కడియాల, ఈసీఈ అధిపతి డాక్టర్ వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

స్టాండింగ్ కమిటీ చైర్మన్ల నియామకం

హనుమాన్‌జంక్షన్, జనవరి 27: బాపులపాడు మండలస్థాయిలో ఏర్పాటు చేసిన మూడు స్టాండింగ్ కమిటీలకు చైర్మన్లను నియమించినట్లు బాపులపాడు ఎంపీడీవో కె.జోగేశ్వరరావు తెలిపారు. మండలస్థాయిలో ప్రజలు ఎదుర్కొనే సమస్యలను పరిష్కరించేందుకు ఏర్పాటు చేసిన మూడు స్టాండింగ్ కమిటీలకు ఎంపీపీ, వైస్ ఎంపీపీలను చైర్మన్లుగా నియమిస్తూ సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించినట్లు ఎంపీడీవో తెలిపారు. మౌలిక వసతులు కమిటీకి ఎంపీపీ వై.నగేష్, సహజవనరుల కమిటీకి వైస్ ఎంపీపీ పందు రాణి, మానవ వనరుల కమిటీకి చందు రమాదేవిలు చైర్మన్లుగా బాధ్యతలు నిర్వహిస్తారని తెలిపారు. ఈమూడు కమిటీలకు కన్వీనర్‌గా ఎంపీడీవో వ్యవహరిస్తారని ఆయన తెలిపారు.

మొక్కుబడిగా మండల సమావేశం

- 24 మంది ఎంపీటీసీ సభ్యులకుగాను 8 మంది హాజరు
- రిజిస్టర్‌లో 12 మంది హాజరైనట్లుగా సంతకాలు
- బాపులపాడు ప్రజాప్రతినిధుల తీరుపై స్థానికుల పెదవి విరుపు



సభ్యుల గైర్హాజరుతో ఖాళీగా ఉన్న కుర్చీలు

హనుమాన్‌జంక్షన్, జనవరి 27: బాపులపాడు మండల పరిషత్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన సర్వసభ్య సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు చాలా మంది గైర్హాజరు అయ్యారు. ఎంపీపీ వై.నగేష్ అధ్యక్షతన ఎంపీడీవో కె.జోగేశ్వరరావు సర్వసభ్య సమావేశం నిర్వహించారు. మండల పరిషత్‌లో 24 మంది సభ్యులు, ఒక కో-ఆప్షన్ సభ్యుడు కలిపి 25 మంది ఉండగా కేవలం 8మంది మాత్రమే హాజరయ్యారు. రిజిస్టరులో మాత్రం 12 మంది హాజరైనట్లుగా సంతకాలు చూపించారు. హాజరైన 8 మంది సభ్యుల్లో ఎంపీపీ, వైస్ ఎంపీపీ చందు రమాదేవి, కో-ఆప్షన్ సభ్యుడు తానీషా పోతే సమావేశంలో 5గురు మాత్రమే కనిపించారు. కోరం రాకుండ సమావేశం నిర్వహించ కూడదన్న నిబంధనతో రిజిస్టరులో మాత్రం 12 మంది వచ్చినట్లు సంతకాలు చేయించారు. సంతకాలు చేసిన నలుగురు సభ్యులు సమావేశంలో కనిపించకపోవడం గమనార్హం. ఈ పాలక వర్గం బాధ్యతలు తీసుకొని రెండేళ్లు దాటింది. మొదటి నుంచి ఇదే పరిస్థితి వస్తూనే ఉందన్న విమర్శలు వినిపిస్తునే ఉంది. ప్రజల సమస్యలపై అధికారులతో చర్చించి పరిష్కరించాల్సిన ప్రజాప్రతినిధులు సమావేశానికి గైర్హాజరు అవ్వడంతో పెదవి విరుస్తున్నారు. సమావేశంలో పాల్గొన్న అధికారులు మొక్కు బడిగా తమ శాఖల పనితీరు వెల్లడించారు.

సభ్యుల హాజరుపై ఎంపీపీ ఆగ్రహం

మండల పరిషత్ సభ్యుల గైర్హాజరు పట్ల ఎంపీపీ యరగొర్ల నగేష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశం ప్రారంభోపన్యాసంలో ఎంపీపీ మాట్లాడుతూ, మూడు నెలలకొకసారి జరిగే సర్వసభ్య సమావేశానికి కూడ సభ్యులు చాలా తక్కువ సంఖ్యలో హాజరు కావడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. సభ్యులతో పాటు, సర్పంచ్‌లు, అధికారులు విధిగా హాజరై ప్రజల సమస్యలను పరిష్కరించడానికి కృషి చేయాలని కోరారు. సమావేశంలో వైస్ ఎంపీపీ చందు రమాదేవి, డిప్యూటీ తహసీల్దార్ రమణ, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎన్నికల విధులపై బూత్ కమిటీలకు అవగాహన



ఓటర్ల జాబితాపై బూత్ లెవల్ కమిటీ సభ్యులకు అవగాహన కల్పిస్తున్న నాయకులు

కంకిపాడు, జనవరి 27 : వలంటీర్లను అడ్డుపెట్టుకొని అధికార పార్టీ నాయకులు ఓటర్ల జాబితాలో అవతవకలకు పాల్పడుతున్నారని టీడీపీ జిల్లా నాయకులు అన్నే ధనయ్య ఆరోపించారు. కంకిపాడు మండల పార్టీ కార్యాలయంలో మండల అధ్యక్షుడు సుదిమళ్ల రవీంద్ర అధ్యక్షతన ఉప్పలూరు క్లస్టర్ బూత్ కమిటీ సభ్యులకు ఎన్నికల విధులపై అవగాహన తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నే మాట్లాడుతూ, వలంటీర్లను అడ్డుపెట్టుకొని ఓటర్ల జాబితాలో అవకతవకలకు అధికార పార్టీ పాల్పడుతుందని, ఎన్నికల నాటికి వలంటీర్లు ఉండరన్నారు. ఓటర్ల జాబితాలను క్షుణ్ణంగా పరిశీలించాలని, అవకతవకలు ఉంటే తక్షణం అధికారుల దృష్టికి తీసుకువెళ్లాలని సూచించారు. వైసీపీకి ఓటు వేయకుంటే సంక్షేమ పథకాలు తీసేవేస్తామంటూ వలంటీర్లు ఓటర్లను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని తెలియజేశారు. అటువంటి వారిపై చర్యలుకు అధికారులకు సూచించాలన్నారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ కన్వీనర్లు, బూత్ కమిటీ సభ్యులు యార్లగడ్డ రాజాబాబు, నాని, కళ్యాణి, కాసరనేని మురళి, ఈడే కోటేశ్వరరావు, ఉద్దండి కుటుంబరావు, చలసాని రాధాకృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో విద్యనభ్యసించాలి



మాట్లాడుతున్న చైర్మన్ సురేశ్‌బాబు

ఉయ్యూరు, జనవరి 27 : క్రమ శిక్షణతో కష్టపడి విద్యనభ్యసించి ఉన్నత స్థాయికి చేరుకోవాలని రక్ష ఫౌండేషన్ చైర్మన్ పడమట సురేశ్‌బాబు అన్నారు. ఉయ్యూరు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు సాయంత్రం స్టడీ అవర్‌లో అల్పాహారానికి అవసరమైన ఏర్పాట్లు చేసేందుకు ముందుకు వచ్చి సాయం అందజేశారు. ట్రస్టు ప్రతినిధి స్నిగ్ధ, హెచ్ఎం శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వంటపాత్రలు అందజేత



పాత్రలు అందజేస్తున్న రంగమ్మ

హనుమాన్‌జంక్షన్‌రూరల్, జనవరి 27 : వీరవల్లి ఎంపీయూపీ స్కూల్‌కు ప్రభుత్వం మంజూరు చేసిన వంటపాత్రలను విద్యాకమిటీ అధ్యక్షురాలు రాయి రంగమ్మ శనివారం అందజేశారు. విద్యార్థులకు ప్రభుత్వంతోపాటు దాతలందిస్తున్న సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ మాజీ డైరెక్టర్ కోడెబోయిన బాబి, మోర్ల ఆంజనేయులు, ఉపాధ్యాయులు ఉషారాణి, భవిత స్కూల్ ఐఈఆర్పీ ఉపాధ్యాయులు కె.సుశీల, జె.నాగమణి, తదితరులు పాల్గొన్నారు.

పేదల పట్టాలకు రిజిస్ట్రేషన్

హనుమాన్‌జంక్షన్, జనవరి 27: మండలంలో పేదల కాలనీల్లో పట్టాలు పంపిణీ చేసిన లబ్ధిదారులందరికీ రిజిస్ట్రేషన్ చేస్తున్నట్లు బాపులపాడు తహసీల్దార్ సునీల్‌బాబు తెలిపారు. శనివారం నుంచి సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ పంచాయతీ కార్యదర్శి, వీఆర్వోలు చేతులు మీదుగా రిజిస్ట్రేషన్లు చేస్తున్నట్లు తెలిపారు.

అంతర్జాతీయ పోటీలకు ముస్తాబాద యువకుడు



ఖమర్ బాషా

గన్నవరం, జనవరి 27 : మండలంలోని ముస్తాబాదకు చెందిన షేక్ ఖమర్ బాషా అంతర్జాతీయ షూటింగ్ బాల్ పోటీలకు ఎంపికయ్యాడు. ఈ మేరకు శనివారం అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పరశు రాముడు ఉత్తర్వులను పంపారు. మార్చి 1 నుంచి 3వ తేదీ వరకూ న్యూఢిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ ఇండోర్ స్టేడియంలో జరిగే అంతర్జాతీయ షూటింగ్ బాల్ పోటీలలో భారత జట్టు తరపున ప్రాతినిధ్యం వహించనున్నారు. 2022 డిసెంబరులో వారణాసిలో జరిగిన పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరచటంతో ఈ పోటీలకు ఎంపికైనట్లు ఖమర్ బాషా తెలిపారు. 17దేశాలు పాల్గొనే ఈ ప్రపంచ కప్ పోటీలలో భారత జట్టు తరపున ఆడటం ఆనందంగా ఉందన్నారు.

విద్యార్థులు ఆంగ్లంపై పట్టు సాధించాలి

డీవైఈవో పద్మరాణి



విజేతలకు బహుమతులు అందజేస్తున్న డీవైఈవో పద్మరాణి

ఉంగుటూరు, జనవరి 27 : గ్రామీణ ప్రాంత విద్యార్థులు ఆంగ్లభాషలో మంచి పట్టు సాధించేందుకు అవసరమైన కార్యక్రమాలు చేపట్టడంతోపాటు, ఆంగ్ల భాషాభివృద్ధికి మానికొండలోని శశిథ రూరల్ ఎంపవర్‌మెంట్ ట్రస్ట్ చేస్తున్న కృషి అభినందనీయమని డీవైఈవో పద్మరాణి అన్నారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో మూడో తరగతి నుంచి డిగ్రీ విద్యార్థులకు మండల స్థాయిలో నిర్వహించిన ఆంగ్ల పదాల పోటీ పరీక్షల్లో విజేతలకు శనివారం మానికొండలో జరిగిన బహుమతి ప్రధానోత్సవ కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా డీవైఈవో మాట్లాడుతూ, నేటి సమాజంలో ఉద్యోగ, ఉపాధి రంగాల్లో ఆంగ్ల భాషా పరిజ్ఞానం కలిగిన విద్యార్థులకే అవకాశాలు దక్కుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో శశిథ రూరల్ ఎంపవర్‌మెంట్ ట్రస్ట్ అధ్యక్షుడు పరసా ఇస్మాయేలు, ప్రసన్నకుమారి, సర్పంచ్ నిమ్మకూరి స్వర్ణలత, ఎంపీడీవో జీఎస్వీ శేషగిరిరావు, ఎంఈవోలు జి.వెంకటేశ్వరరావు, జె.సాంబశివరావు, గోగినేని వెంకటేశ్వరరావు, నెర్సు చింతయ్య, పి.వెంకటసుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.



ఆకునూరులో ఇంటింటా ప్రచారం చేస్తున్న బోడె హేమ

మహిళాభ్యున్నతికి ప్రాధాన్యం

మాజీ ఎమ్మెల్యే బోడె ప్రసాద్ సతీమణి హేమ

ఆకునూరు(ఉయ్యూరు), జనవరి 27 : మహిళల అభ్యున్నతి, సంక్షేమానికి తెలుగుదేశం పార్టీ ప్రాధాన్యం ఇస్తుందని, టీడీపీ పెనమలూరు ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే బోడె ప్రసాద్ సతీమణి హేమ అన్నారు. పార్టీ నాయకులతో కలసి శనివారం ఆకునూరులో పర్యటించి చంద్రబాబునాయుడు ప్రకటించిన సంక్షేమ పథకాలు ప్రజలకు వివరించారు. నిత్యావసరాల ధరలతో పాటు బస్సు, విద్యుత్ చార్జీ పెంచి పేద, మధ్యతరగతి ప్రజలపై వైసీపీ ప్రభుత్వం పెనుభారం మోపిందన్నారు. సర్పంచ్ గోలి వసంతకుమార్, పార్టీ నాయకులు వెంకటేశ్వరరావు, కాకాని వరప్రసాద్, కాకాని శ్రీనివాసరావు, కొండా ప్రవీణ్, తుమ్మలపల్లి హరి కృష్ణ, రంగారావు, బొంతు మేరీ రాణి, రంగారావు పాల్గొన్నారు.

టీడీపీ మేనిఫెస్టోను ప్రజల్లోకి తీసుకెళ్లాలి..

పునాదిపాడు (కంకిపాడు) : మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రవేశ పెట్టిన మేనిఫెస్టోను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లాలని టీడీపీ సీనియర్ నాయకులు తుమ్మలపల్లి హరికృష్ణ అన్నారు. మండలంలోని పునాదిపాడులో శనివారం నిర్వహించిన బాబూ ష్యూరిటీ- భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, మహిళలకు ఉచిత బస్సు, ఏడాదికి మూడు సిలిండర్లు పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా రైతు నాయుడు మద్దాలి సాయిబాబు, పులి శ్రీనివాసరావు, కొండా నాగేశ్వరరావు, అన్నవరపు శివపార్వతి తదితరులు పాల్గొన్నారు.

- జగన్నాథపురంలో నిర్వహించిన బాబూ ష్యూరిటీ- భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు సుదిమళ్ల రవీంద్ర, వణుకూరు విక్రం, బొర్రా వెంకట్, ఉప్పు నారాయణరావు, నూకల నాగార్జున, జనసేన పార్టీ నాయకులు మేకల మణికంఠ పాల్గొన్నారు.

కృష్ణా

• మచిలీపట్నం • పెడన • గుడివాడ • పామర్రు • అవనిగడ్డ

బ్రాయిలర్ ధరలు



అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	119, 127, 138
చికెన్ విత్ స్కిన్	226
చికెన్ స్కిన్‌లెస్	236

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 5.40

విద్యుత్ చార్జీలపై ప్రజాభిప్రాయ సేకరణ రేపటి నుంచి

గుడివాడ : విద్యుత్ సమస్యలు, చార్జీల పెంపు ప్రతిపాదనపై ఈనెల 29, 30, 31 తేదీల్లో విద్యుత్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కార్యాలయంలో ఏపీ విద్యుత్ నియంత్రణ మండలి ఆధ్వర్యంలో ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించనున్నట్లు విద్యుత్ శాఖ ఈఈ టి.రామకృష్ణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ప్రతిపాదించిన ఆదాయం, విద్యుత్ చార్జీల పెంపు తదితర అంశాలపై ప్రజాభిప్రాయ సేకరణ జరుగుతుందన్నారు. విద్యుత్ వినియోగదారులు పాల్గొని తమ అభిప్రాయాలను నియంత్రణ మండలికి తెలియజేయాల్సిందిగా కోరారు.



బాపూజీనగర్‌లో పర్యటిస్తున్న వెనిగండ్ల రాము



కొమాళ్లపూడి గ్రామంలో బాబు ష్యూరిటీ కరపత్రాలు అందజేస్తున్న కాగిత



చినముత్తేవిలో బాబు ష్యూరిటీ కార్యక్రమంలో కుమార్ రాజా



జయహో బీసీ సదస్సులో మాట్లాడుతున్న మండలి బుద్ధప్రసాద్

చంద్రబాబు పాలన అవశ్యం

● బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీలో వెనిగండ్ల రాము, కాగిత కృష్ణప్రసాద్

గుడివాడ, జనవరి 27 : చంద్రబాబును సీఎంను చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని గుడివాడ నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి వెనిగండ్ల రాము అన్నారు. గుడివాడలోని బాపూజీనగర్ ప్రాంతంలో శనివారం బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారెంటీ, ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమంలో పాల్గొని ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. రెండు పేద కుటుంబాలకు ఇస్త్రీ బండ్లు, ఒక తోపుడు బండి అందజేశారు. మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, మున్సిపల్ మాజీ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు, జనసేన ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, అర్బన్ బ్యాంకు చైర్మన్ పిన్నమనేని బాబ్జీ, మాజీ కౌన్సిలర్లు మేరుగు మరియకుమారి. రేమల్లి మరియకుమారి, వసంతవాడ దుర్గారావు, షేక్ ఇబ్రహీం, మాజీ ఐఎఫ్ఎస్ అధికారి కాకొల్లు భస్కాకరరావు, దింట్యాల రాంబాబు, వాసే మురళీ, పోలాసి ఉమామహేశ్వరరావు, కొడాలి రామరాజు, మేరుగు మోజెస్, ఆకునూరి కనకాంబరం, బుర్రా కుమార్‌రాజా, చల్లపల్లి మణికుమార్, జగం లారా, దాసరి వెంకటరామకృష్ణ, ఏసుపాదం, జనసేన పట్టణాధ్యక్షులు మజ్జి శ్రీనివాసరావు, పార్టీ అనుబంధ విభాగాల నాయకులు పాల్గొన్నారు. **కృత్తివెన్ను :** కొమాళ్లపూడి గ్రామంలో టీడీపీ, జనసేన పార్టీల ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం శనివారం నిర్వహించారు. పెడన నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి కాగిత కృష్ణప్రసాద్ ఇంటింటికి తిరుగుతూ, టీడీపీ, జనసేన ఉమ్మడి మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. బాబు ష్యూరిటీ బాండ్‌లను ప్రజలకు అందించారు. మండల టీడీపీ అధ్యక్షుడుఒడుగు తులసీరావు, టీడీపీ నాయకులు నెక్కంటి భాస్కరరావు, కూనసాని శ్రీనివాసరావు, కూనసాని చిన్న, బస్వాని బంగార్రాజు, తిరుమాని పాండురంగారావు, వలవల తాతాజీ తదితరులు పాల్గొన్నారు. **కూచిపూడి :** రాష్ట్ర ముఖ్యమంత్రిగా చంద్రబాబును గెలిపించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని టీడీపీ పామర్రు నియోజకవర్గ ఇన్‌చార్జ్ వర్ల కుమార్ రాజా తెలిపారు. బాబు ష్యూరిటీ - భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమాన్ని మొవ్వ మండలం చిన ముత్తేవి గ్రామంలో శనివారం నిర్వహించారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే చేపట్టబోయే సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. మండల పార్టీ అధ్యక్ష, కార్యదర్శులు లింగమనేని రామలింగేశ్వరరావు, వీరంకి తులసీదాస్, పార్టీ నేతలు యార్లగడ్డ శ్రీనివాసరావు, కొమ్ము అర్జున్, కాట్రగడ్డ శ్రీనివాసరావు, సిద్దెల జయబాబు, మురారి నాగరాజు, వెంపటి గోపాలకృష్ణ, కార్యకర్తలు పాల్గొన్నారు.

దొంగ ఓట్లపై అప్రమత్తంగా ఉండాలి

పామర్రు : చంద్రబాబును ముఖ్యమంత్రి చేసే బాధ్యత గ్రామ, మండల స్థాయి నాయకులపై ఉందని పామర్రు నియోజవర్గ టీడీపీ ఇన్‌చార్జి వర్ల కుమార్‌రాజా అన్నారు. బూత్ కన్వీనర్లు, క్లస్టర్ కన్వీనర్ల సమావేశంలో శనివారం ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి అధికారాన్ని అడ్డుపెట్టుకుని దొంగో ఓట్లతో తిరిగి అధికారంలోకి రావడం కోసం పాకులాడుతున్నాడని దుయ్యబట్టారు. జగన్ అరచక పాలన పట్ల అప్రమత్తంగా వ్యహరిస్తూ దొంగ ఓట్లపై టీడీపీ శ్రేణులు డేగ కన్ను వేసి ఉంచాలన్నారు.

టీడీపీ పాలనలోనే బీసీల అభ్యున్నతి : మండలి, కొనకళ్ల

అవనిగడ్డ, జనవరి 27 : బీసీల సర్వతోముఖాభివృద్ధి టీడీపీతోనే సాధ్యమని మాజీ ఎంపీ కొనకళ్ల నారాయణరావు, మాజీ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్ అన్నారు. అవనిగడ్డలో శనివారం జయహో బీసీ సదస్సులో కొనకళ్ల నారాయణరావు, మండలి బుద్ధప్రసాద్ పాల్గొని మాట్లాడారు. బీసీలకు వైసీపీ ప్రభుత్వం చేస్తున్న అన్యాయాన్ని వివరించారు. జగన్మోహన్‌రెడ్డి రాష్ట్రంలో బీసీలకు అమలవుతున్న 30 పథకాలను అటకెక్కిం చారన్నారు. మండల టీడీపీ అధ్యక్షుడు యాసం చిట్టిబాబు నేతృత్వంలో మాజీ ఎంపీపీ లుక్కా పిచ్చియ్య అధ్యక్షతన జరిగిన జయహో బీసీ సభలో వీరంకి గురుమూర్తి, బత్తిన దాసు, బచ్చుల బోసు, లంకే నారాయణ ప్రసాద్, మోర్ల జయలక్ష్మి, విశ్వనాథపల్లి పాప, కొల్లూరి వెంకటేశ్వరరావు, యాసం చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు. నాగాయలంక : టీడీపీ పాలనలోనే బీసీలకు మేలు జరుగుతుందని మాజీ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్, కొనకళ్ల జగన్నాథం (బుల్లయ్య) అన్నారు. గౌడపాలెంలో శనివారం జరిగిన జయహో బీసీ సదస్సులో వారిద్దరూ పాల్గొని మాట్లాడారు. తెలుగుదేశం పార్టీ బీసీల సంక్షేమానికి, రక్షణకు అవసరమైన చర్యలు తీసుకుంటుందన్నారు. గ్రామ పార్టీ అధ్యక్షులు తాతా శేషగిరి అధ్యక్షతన జరిగిన సదస్సులో మండలి వెంకట్రామ్ (రాజా), లంకే నారాయణ ప్రసాద్, లకనం నాగాంజనేయులు, టి.మస్తానరావు, మండవ బాలవర్ధిరావు, మెండు లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.



కొల్లు ఫౌండేషన్ అన్నదానం

మచిలీపట్నం టౌన్ : వైసీపీ పాలనలో సామాన్య ప్రజలు పస్తులుండే రోజులు వచ్చాయని టీడీపీ నాయకుడు గుమ్మడి విద్యాసాగర్ అన్నారు. కొల్లు ఫౌండేషన్ ఆధ్వర్యంలో 22వ డివిజన్ ముస్తాఖాన్‌పేట ఎస్సీ కాలనీలో శనివారం అన్నదానం జరిగింది. నగర టీడీపీ అధ్యక్షుడు ఎండి ఇలియాస్ పాషా, ప్రధాన కార్యదర్శి పిప్పళ్ళ వెంకన్నలతో పాటు టీడీపీ నాయకులు గుమ్మడి విద్యాసాగర్, కార్పొరేటర్ దేవరపల్లి అనిత, తెలుగు మహిళ పాలపర్తి పద్మజ, రాష్ట్ర ఎస్సీ సెల్ నాయకుడు బురకా బాలాజీ, టీడీపీ సాంస్కృతిక విభాగ అధ్యక్షుడు బొడ్డు నాగరాజు, వసంతకుమారి, కొల్లు ఫౌండేషన్ సభ్యులు మెట్టు సూరిబాబు, మోకా అప్పారావు, ఊకంటి రాజు తదితరులు పాల్గొన్నారు.

దోకిపర్రులో తీవ్ర తాగునీటి ఎద్దడి

●అడుగంటిన పంచాయతీ చెరువు ● సమ్మర్ స్టోరేజీ ట్యాంకును నింపడంలో అధికారుల నిర్లక్ష్యం

గుడ్లవల్లేరు : దోకిపర్రు గ్రామ ప్రజలు తాగు, వాడునీటికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పంచాయతీ చెరువులో నీరు అడుగంటింది. వారం రోజులుగా పంచాయతీ కుళాయిలకు నీటిసరఫరా నిలిపివేశారు. గ్రామంలో నీటి ఎద్దడి ఎదురు కాకూడదని ముందు చూపుతో గతంలోనే 30 ఎకరాల బర్రెడ్డి చెరువును తవ్వి, సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్‌గా వాడుతున్నారు. ఇక్కడే అధికారుల నిర్లక్ష్యం బట్టబయలైంది. దాదాపు మూడు నెలల కింద 30 ఎకరాల సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ లో నీటిని చేపలు పట్టేందుకు తోడేశారు. చేపలు పట్టడం పూర్తయిన తర్వాత సమ్మర్ స్టోరేజీ ట్యాంకును నింపలేదు. ఇప్పుడేమో ఎప్పుడూ తాగునీటిని అందించే పంచాయతీ చెరువు అడుగంటింది. సమ్మర్ స్టోరేజీ ట్యాంకును నీటి ని నింపలేదు. చెరువులను నింపడానికి కాల్వలకు ప్రభుత్వం నీరివ్వడం లేదు. ఈ కారణంగా గ్రామస్థులు తీవ్ర నీటి ఎద్దడిని ఎదుర్కొంటున్నారు. వారం రోజులుగా గ్రామస్థులు నీటికోసం పడని తిప్పలు లేవు. బావులకు వెళ్లి నీరు తోడుకోవడం, కిలో మీటర్ల దూరంలో ఉన్న కాల్వల్లో నీటిని ఆటోలు, ఎడ్లబండ్లు, ట్రాక్టర్లపై పీపాలతో తెచ్చుకుని వాడుకుంటున్నారు. మూడు రోజుల నుంచి పంచాయతీ అధికారులు ట్యాంకర్లతో నీటిని సరఫరా చేస్తున్నారు. రోజుకు మూడు లక్షల లీటర్ల నీరు సరఫరా చేయాల్సి ఉండగా, ట్యాంకర్లతో అరకొరగా సరఫరా చేస్తున్నారని గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గురువారం బోదెల్లోని నీటిని టాంక్‌కు ఎక్కించి శుక్రవారం నీరు సరఫరా చేయగా, దుర్వాసనతో మురికిగా వచ్చాయని ప్రజలు వాపోయారు. ఈ సమస్య ఎప్పటికి తీరేనో అంటూ గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేశారు. కార్యదర్శి రమేష్‌ను వివరణ కోరగా గత నెలలో వేడుకలకు ఎక్కువ నీరు ఇవ్వడంతో సమస్య నెలకొందని, త్వరలో చెరువు నింపి సమస్యను పరిష్కరిస్తామన్నారు.



నీరు లేక వెలవెలబోతున్న దోకిపర్రు పంచాయతీ చెరువు



ఎడ్ల బండిపై డ్రమ్ముల్లో నీరు తెచ్చుకుంటున్న ప్రజలు



పత్తాలేని పంచాయతీ అధికారులు

దోకిపర్రు టీడీపీ అధ్యక్షుడువీరమాచనేని శివప్రసాద్, మాజీ సర్పంచ్ జోగి వెంకటేశ్వరరావు మరికొందరు గ్రామస్థులు తాగునీరు తదితర సమస్యను చెప్పేందుకు పంచాయతీ కార్యాలయానికి వెళ్లి ఉదయం 10 గంటల నుంచి 11.30 గంటల వరకూ వేచి చూసినా అధికారులు రాలేదు. నీటిసమస్య పరిష్కరించడంలో అధికారులు విఫలమయ్యారని వీరమాచనేని మండిపడ్డారు. డివిజనల్ పంచాయతీ అధికారి వస్తున్నారని తెలిసి గ్రామస్థులు అక్కడికి వెళ్లగా, వేంకటేశ్వరస్వామిని దర్శించుకొని అక్కడి నుండే వెనుతిరిగారని విశ్వసనీయ సమాచారం.

చిరంజీవి అభిమానుల సంబరాలు



నాగాయలంక, జనవరి 27 : నటుడు చిరంజీవికి పద్మవిభూషణ్ అవార్డు వచ్చిన సందర్భంగా మెగాస్టార్ అభిమానులు, జనసేన పార్టీ నేతలు భారీ కేక్ కట్ చేశారు. బండ్రెడ్డి మల్లిఖార్జునరావు, మాదివాడ నిరంజన్, బోనం పా పారావు, బొడ్డు విజయ్, సనకా మారుతీ, పొన్నంపల్లి చిన్న, యర్రంశెట్టి బసవ కుమార్, అభిమానులు పాల్గొన్నారు.

వృద్ధులకు అన్నదానం

గుడివాడ : మెగాస్టార్ చిరంజీవికి కేంద్రం పద్మవిభూషణ్ అవార్డును ప్రకటించడం పట్ల తోట సాయి ఫ్రెండ్స్ సర్కిల్, చిరంజీవి అభిమానుల ఆధ్వర్యంలో శనివారం ఘనంగా వేడక నిర్వహించారు. బేతవోలులోని శాంతి వృద్ధాశ్రమంలో వృద్ధులకు భోజన సదుపాయం కల్పించి పండ్లు అందజేశారు. తొలుత కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. సామాజికవేత్త మాచర్ల రామకృష్ణ, రెవ. బిషప్ అప్పికట్ల జాషువా, అభిమానులు పాల్గొన్నారు.

నేటి బీసీ సదస్సును విజయవంతం చేయండి

కోడూరు : బీసీలపై దాడులు, అఘాయిత్యాలు, నివారించేందుకు ఆదివారం జరిగే జయహో బీసీ సదస్సును విజయవంతం చేయాలని మండల టీడీపీ అధ్యక్షుడు బండే శ్రీనివాసరావు కోరారు. సాలెంపాలెంలో జయహో బీసీ సభ జరుగుతుందన్నారు. ముఖ్యఅతిథులుగా మాజీ ఉపసభాపతి మండలి బుద్ధ ప్రసాద్, మాజీ ఎంపీ కొనకళ్ల నారాయణరావు హాజర వుతారన్నారు. కార్యకర్తలు విరివిగా పాల్గొనాలన్నారు.

స్వచ్ఛ చల్లపల్లి స్ఫూర్తిదాయకం : బండ్రెడ్డి



చల్లపల్లి : స్వచ్ఛ చల్లపల్లి కార్యకర్తల శ్రమతో స్వచ్ఛ చల్లపల్లి ఉద్యమం జాతీయస్థాయిలో ఆదర్శంగా నిలిచిందని జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు బండ్రెడ్డి రామకృష్ణ అన్నారు. శనివారం 3012వ రోజు స్వచ్ఛ చల్లపల్లి కార్యక్రమంలో రామకృష్ణ పాల్గొని శ్రమదానం చేశారు. స్వచ్ఛత కోసం డీఆర్కే దంపతులు చేస్తున్న కృషి చిరస్థాయిగా నిలిచిపోతుందన్నారు. సర్పంచ్ కృష్ణకుమారి, స్వచ్ఛ రథసారథులు డాక్టర్ డీఆర్‌కె.ప్రసాద్, డాక్టర్ పద్మావతి, జనసేన నాయకులు పాల్గొన్నారు.

వీఆర్వో గోపాలకృష్ణకు సన్మానం



మోపిదేవి : గణతంత్ర వేడుకల్లో కలెక్టర్ నుంచి ప్రశంసాపత్రం అందుకున్న వీఆర్వో మత్తి గోపాలకృష్ణ ప్రసాద్‌ను తహసీల్దార్ కార్యాలయంలో శనివారం ఘనంగా సన్మానించారు. మోపిదేవిలంక, నాగాయితిప్ప గ్రామాల వీఆర్వోగా సేవలందిస్తున్న గోపాలకృష్ణ సేవలు మరింత ప్రజలకు చేరువ కావాలంటూ తహసీల్దార్ కె.నవీన్ కుమార్ తెలిపారు. ఉద్యోగులు, వీఆర్వోలు దుశ్శాలువా, పూలమాలలతో ఆయనను ఘనంగా సత్కరించారు.

నందిగామ సర్పంచ్‌గా హరిబాబు



పెడన రూరల్ : మచిలీపట్నం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఆదేశానుసారం నందిగామ సర్పంచ్‌గా బొడ్డు హరిబాబు శనివారం బాధ్యతలు చేపట్టారని ఎన్నికల సహాయ అధికారి వి.రెడ్డయ్య తెలిపారు. ప్రస్తుత సర్పంచ్ బొడ్డు చినబాబు ఎన్నికల అఫిడవిట్‌లో తప్పుడు సమాచారం ఇచ్చినట్లు హరిబాబు ఫిర్యాదు చేయడంతో కోర్టు పైమేరకు ఆదేశించింది. ఈవోఆర్డీ జయరామ, మాజీ సర్పంచ్ పామర్తి సుబ్రహ్మణ్యం హరిబాబును అభినందించారు.

ఘనంగా విజయక్రాంతి ఫేర్‌వెల్ డే

చల్లపల్లి : విజయక్రాంతి జూనియర్ కళాశాల ఫేర్‌వెల్ డే వేడుకలో ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందించారు. సీఐ సిహెచ్.నాగప్రసాద్, ఎస్సై సిహెచ్.చిన్నబాబు, సీఏ అక్కయ్యనాయుడు, ఎస్‌వీఎల్ విద్యాసంస్థల అధినేత దుట్టా ఉమామహేశ్వరరావు, కళాశాల కరస్పాండెంట్ దుట్టా శివరామప్రసాద్ ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులు, తల్లిదండ్రులను సన్మానించి ప్రోత్సాహక బహుమతులు అందజేశారు.

మహాభారతం మహోన్నతం : చింతలపాటి




మచిలీపట్నం టౌన్ : మహాభారతంలో ఎన్నో సామాజిక ధర్మాలు దాగి ఉన్నాయని సిరికవి డాక్టర్ చింతలపాటి మురళీకృష్ణ అన్నారు. మహతి లలిత కళావేదికపై శనివారం రాత్రి ధర్మసారం-మహాభారతం అనే అంశంపై డాక్టర్ చింతలపాటి మురళీకృష్ణ ప్రసంగించారు. డాక్టర్. ధన్వంతరీ ఆచార్య, ఆర్టీసీ డీఎం పెద్దిరాజు, కృష్ణమోహనరావు, కె. మోహన్‌దాస్ గాంధీ, దామోదర్, నాగలింగ శాస్త్రి, కాపవరపు చంద్రశేఖర్, అప్పినీడి పోతురాజు, మేడిశెట్టి యోగేశ్వరరావు తదితరులు మాట్లాడారు.

పరస్పర ఫిర్యాదులపై కేసు నమోదు

కోడూరు : ఉల్లిపాలెంలో జరిగిన సంఘటనలో పరస్పర ఫిర్యాదు మేరకు ఇరువర్గాలపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై వీరాంజనేయులు తెలిపారు. పెదసింగు రాంబాబు తన ఇంటికి వచ్చి లైంగిక వాంఛ తీర్చమనడంతో నిరాకరించానని, దాంతో కులంపేరుతో దూషిస్తూ తన తండ్రితో కలిసి దాడి చేశాడని ఆరోపిస్తూ పోలాబత్తిన లీలావతి పోలీసులకు ఫిర్యాదు చేసింది. తన అన్న కుమార్తె మతిస్థిమితం లేక ఈనెల 25వ తేదీ రాత్రి పోలాబత్తిన ప్రసాద్ ఇంటి ఆవరణలోకి వెళ్లిందని, అప్పటి నుంచి ప్రసాద్ భార్య లీలావతి దుర్భాషలాడుతూ దాడి చేసిందని రాంబాబు, వాణి, సీతామహాలక్ష్మి ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

సీఐ నాగప్రసాద్‌కు వాకర్స్ సత్కారం



చల్లపల్లి : గణతంత్ర దినోత్సవ పురస్కారం అందుకున్న చల్లపల్లి సీఐ సిహెచ్. నాగప్రసాద్‌ను గ్రామ పంచాయతీ పార్కులో శనివారం ఉదయం వాకర్స్ దుశ్శాలువాలతో సత్కరించారు. వాసుదేవరావు, శరత్‌బాబు, జీవి.తాతారావు, రామాంజనేయులు, రాజా, వెంకటేశ్వరరావు, సత్యనారాయణ, రవీంద్రబాబు పాల్గొన్నారు.

చల్లపల్లి క్రికెట్ జట్టుకు ఘనస్వాగతం



చల్లపల్లి : ఆడుదాం ఆంధ్రా విజేతలుగా నిలిచిన చల్లపల్లి క్రికెట్ జట్టుకు శనివారం రాత్రి గ్రామంలో ఘనస్వాగతం లభిం చింది. ఎంపీడీవో సిహెచ్.చినరాట్నాలు, సర్పంచ్ కృష్ణకుమారి, ఉపసర్పంచ్ ముమ్మనేని నాని, కార్యదర్శి పి.వి.మాధవేంద్రరావు క్రీడాకారులకు ఘనస్వాగతం పలికారు. క్రీడాకారులు, పీడీ, పీఈటీలు శ్రీలక్ష్మి, చోటీరాణిలను ఘనంగా సన్మానించారు.